మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 8-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 129 Issue: 129

Published from Jagitial
www.evarthalu.com


08 నవంబర్ 2025 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:21 సూర్యాస్తమయం - సా. 5:38 తిథి తదియ ఉ. 7:33 వరకు తరువాత చవితి తె. 4:250 వరకు సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం మృగశిర రా. 10:04 వరకు తరువాత ఆరుద్ర యోగం శివ సా. 6:29 వరకు కరణం విష్టి ఉ. 7:33 వరకు బవ సా. 6:00 వరకు వర్జ్యం తె. 5:45 నుండి ఉ. 7:13 వరకు దుర్ముహూర్తం ఉ. 7:51 నుండి ఉ. 8:36 వరకు రాహుకాలం ఉ. 9:10 నుండి ఉ. 10:35 వరకు యమగండం మ. 1:24 నుండి మ. 2:49 వరకు గుళికాకాలం ఉ. 6:21 నుండి ఉ. 7:45 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:45 నుండి తె. 5:33 వరకు అమృత ఘడియలు మ. 2:08 నుండి మ. 3:34 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:22 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## వీధికుక్కలు ఉండొద్దు

**రద్దీ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి**

**8 వారాల్లో స్టేటస్ రిపోర్టు ఇవ్వాలి**

**రాష్ట్రాలకు సుప్రీంకోర్టు కఠిన ఆదేశాలు**

దేశవ్యాప్తంగా వీధికుక్కలు, రహదారులపై తిరిగే పశువుల నియంత్రణపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఆసుపత్రులు వంటి ప్రజా ప్రాంగణాల్లో కుక్కకాటు ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఆయా ప్రాంతాలను వీధికుక్కల రహితంగా మార్చాలని ఆదేశాలు జారీ చేసింది.

2

# వీర్యం వీక్!

**మగాళ్లలో తగ్గుతున్న సంతానోత్పత్తి సామర్థ్యం**


## వీర్య కణాల సంఖ్య, నాణ్యత తగ్గిపోతున్నాయ్

**శరీర ఉష్ణోగ్రత పెరిగి వీగిపోతున్న వీర్యం.. వాయు కాలుష్యం, అధిక వేడి వల్లే ఈ దుస్థితి**

## తేరుకోకపోతే మనుగడకు ముప్పే: నిపుణులు



తినే ఆహారం దెబ్బేసింది..
శరీర ఊబకాయం దెబ్బేసింది..
ఒత్తిడి, కుంగుబాటు దెబ్బేసింది..
ధూమపానం దెబ్బేసింది..
ఇప్పుడు కాలుష్యమూ దెబ్బేస్తోంది..!
భూమి భగభగలూ దెబ్బేస్తున్నాయి..!
దెబ్బకు పురుషుడి వీర్యం వీకైపోతోంది..!
సంతానోత్పత్తిలో వీగిపోతున్నాడు..!



(ఈవార్తలు స్పెషల్ బ్యూరో)

కాలుష్యం, వడగాలులు, వాతావరణ మార్పులతో సతమతమవుతున్న వేళ, మరో పెను ముప్పు మానవాళిని వెంటాడుతోంది. పురుషుల్లో సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గిపోతోంది. గత కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా జరిగిన పలు అధ్యయనాల్లో మగవారిలో వీర్య కణాల సంఖ్య, నాణ్యత గణనీయంగా తగ్గుతున్నట్లు వెల్లడైంది. ఆహారపు అలవాట్లు, ఊబకాయం, ధూమపానం, ఒత్తిడి వంటి జీవనశైలి సమస్యలే ఇందుకు కారణమని భావిస్తున్నప్పటికీ, పర్యావరణ మార్పులు, -2 వ పేజీలో...



2

# వందేమాతరం.. భవిష్యత్తుకు ధైర్యం

**గేయంలోని పదాలు ఒక మంత్రం.. ఒక శక్తి.. ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఆయుధం**

**ప్రధాని నరేంద్రమోదీ వెల్లడి.. తపాలా బిళ్ల, నాణెం ఆవిష్కరణ**

స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి నేటితో 150 ఏళ్లు. ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో స్మారక కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు.

## విద్యార్థుల జీవితాలను బలి చేస్తావా?

**ఫీజు బకాయిలు ఇస్తాననది నిజం కాదా?**

**టోకెన్లు ఇచ్చి మోసం చేసింది నిజం కాదా?**

**ప్రైవేట్ కాలేజీలను బ్లాక్‌మెయిల్ చేస్తావా?**

**సీఎం రేవంత్‌పై బండి సంజయ్ ఫైర్**



అన్నింట్లో ఫెయిలైన రేవంత్ రెడ్డి.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో కూడా ఫెయిలవడమే కాకుండా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. 'ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే బ్లాక్ మెయిల్ చేస్తారా? అసెంబ్లీ సాక్షిగా ప్రతినెల రూ.500 కోట్ల చొప్పున ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తానని రేవంత్ రెడ్డి మాట ఇచ్చింది నిజం కాదా?' అని రేవంత్ రెడ్డిని కేంద్ర మంత్రి బండి సంజయ్ నిలదీశారు.

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని టోకెన్లు ఇచ్చి మోసం చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఆనాటి నుంచి నేటి వరకు ఒక్క రూపాయి కూడా బకాయి చెల్లించకుండా కాలేజీ యాజమాన్యాలను మోసం చేస్తోంది నిజం కాదా? అని రేవంత్ రెడ్డి తీరుపై బండి సంజయ్ మండిపడ్డారు. 'రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోతే... మరి టోకెన్లు ఎందుకు ఇచ్చినట్లు? అసెంబ్లీ సాక్షిగా ఎందుకు హామీ ఇచ్చినట్లు? చట్టసభలో తరువాయి 2 వ పేజీలో...

## నా ముందే పరాచికాలా?

**తమాషాలు చేస్తే తాట తీస్తా**

**డొనేషన్లు ఎట్ల తీసుకుంటరో చూస్తా**

**విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలా?**

**ప్రభుత్వాన్నే బ్లాక్‌మెయిల్ చేస్తారా?**

**ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం**



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ కాలేజీ యజమాన్యాలు కాలేజీల బంద్‌కు పిలుపునివ్వడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడితే ఉపేక్షించమని.. తమాషాలు చేస్తే తాట తీస్తామని హెచ్చరించారు.

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): కాలేజీలు మూసివేస్తామంటే ఊరుకునేది లేదని.. విద్యను వ్యాపారం చేస్తామంటే కుదరదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం బకాయి పెట్టిన డబ్బు మమ్మల్ని ఉన్న పళంగా ఇవ్వమంటే ఎలా ఇస్తామని ప్రశ్నించారు. విడతల వారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తామని తెలిపారు. రూ.3 వేల కోట్ల బకాయిలు ఉంటే.. రూ.6 వేల కోట్లు తరువాయి 2 వ పేజీలో...

## కాలేజీలు తెరుస్తాం..

**శనివారం నుంచి రెగ్యులర్ క్లాసులు**

**స్పష్టం చేసిన ప్రైవేట్ విద్యాసంస్థలు**

**డిప్యూటీ సీఎం భట్టితో చర్చలు సఫలం**

**తక్షణమే 600 కోట్లు విడుదల చేస్తాం**

**త్వరలో మిగతా 300 కోట్లు కూడా: భట్టి**



రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై నెలకొన్న సంక్షోభానికి తెరపడింది. ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల యాజమాన్యాలు శుక్రవారం జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి.

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన యాజమాన్యాలు తమ సమ్మెను విరమించుకోవడంతో, వేలాది మంది విద్యార్థులకు ఊరట లభించింది. దీనితో రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు శనివారం తిరిగి తెరుచుకోనున్నాయి. యాజమాన్యాల ప్రతినిధులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమావేశమై, తమకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో సుమారు రూ. 1500 కోట్ల తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,202 |
| వెండి (గ్రాము): | రూ.165 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,389 |

# కేటీఆర్, కిషన్ బ్యాడ్ బ్రదర్స్



## హైదరాబాద్ అభివృద్ధికి అడ్డం వీళ్లే

**సిటీని గ్రోత్ ఇంజిన్‌గా మార్చింది కాంగ్రెస్సే**

**జూబ్లీహిల్స్ ప్రజలు విజ్ఞతతో ఓటెయ్యాలి: రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): రాష్ట్రంలోని జూబ్లీహిల్స్ శాసనసభ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ , బీజేపీ పార్టీలపై.. ముఖ్యంగా వారి అగ్రనాయకులపై తీవ్ర విమర్శనాస్త్రాలు సంధించారు. హైదరాబాద్ మహానగరం అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ కేటీఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలను ఉద్దేశించి 'బ్యాడ్ బ్రదర్స్' అన్నారు. రేవంత్ రెడ్డి తన ప్రచారంలో హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించిన చారిత్రక తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



ఫిన్లాండ్‌లోని హెలెన్‌స్కీ నగరంలో గత 12 నెలలుగా ఒక్క రోడ్డు ప్రమాదం కూడా జరగలేదట. అక్కడ వాహనాల స్పీడ్ లిమిట్ చాలా తక్కువ. వీధులు కూడా స్మార్ట్‌గా డిజైన్ చేసి ఉంటాయి. పాదచారులు, సైక్లిస్ట్‌ల కోసం మౌలిక సదుపాయాలు ఉంటాయి. దాంతో గత సంవత్సర కాలంలో అక్కడ ఎలాంటి ప్రమాదాలు జరగలేదు.

## విమానాల సిగ్నల్ వీక్!

**ఢిల్లీ ఎయిర్‌పోర్టులో సాంకేతిక లోపం.. 800 విమాన రాకపోకలకు అంతరాయం**

**పలు విమాన సర్వీసులు రద్దు.. గంటల తరబడి ఎయిర్‌పోర్టులోనే ప్రయాణికులు**



న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఏటీసీ) వ్యవస్థలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావంతో దాదాపు 800 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముందుగా షెడ్యూల్ చేసిన పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌లో వందలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. దీని ప్రభావం ఉత్తరాది ఎయిర్ పోర్టులపైన పడింది. అయితే ఢిల్లీ ఎయిర్‌పోర్టులోని రన్ వేపై విమానాలు పార్కింగ్ చేసేందుకు తరువాయి 2 వ పేజీలో...



## బనకచర్లకు బ్రేక్!

**డీపీఆర్ టెండర్లు రద్దు.. ఏపీ సర్కారు సంచలన నిర్ణయం**

**అక్టోబర్ 11న ప్రాజెక్ట్ డీపీఆర్ కోసం టెండర్ల ఆహ్వానం**

**31వ వరకు టెండర్లకు గడువు.. టెండర్లు రద్దు చేస్తూ నిర్ణయం**

బనకచర్ల ప్రాజెక్ట్ డీపీఆర్ కోసం పిలిచిన టెండర్లను ఏపీ సర్కారు రద్దు చేసింది. అక్టోబర్ 11వ తేదీన బనకచర్ల ప్రాజెక్ట్ డీపీఆర్ కోసం టెండర్లను ఆహ్వానించిన సర్కారు.. టెండర్ల దాఖలుకు అక్టోబర్ 31వ తేదీ వరకు గడువుగా నిర్ణయించింది. అయితే, తాజాగా డీపీఆర్ కోసం ఆహ్వానించిన టెండర్లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం నేపథ్యంలో డీపీఆర్ టెండర్ల రద్దు ఆసక్తికరంగా మారింది. 2



## రేవంత్‌కు తెలిసిపోయింది

**గులాబీదే గెలుపని అర్థమైపోయింది**

**రెఫరెండం అంటే ఒప్పుకుంటలేడు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

ఈ నెల 14న జూబ్లీహిల్స్‌లో ఎగిరేది గులాబీ జెండానే అని సీఎం రేవంత్ రెడ్డికి కూడా తెలిసిపోయిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వెంగళ్రావ్ నగర్ డివిజన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రోడ్ షోలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టిన సందర్భంగా ఓ జర్నలిస్టు.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మీకు రెఫరెండంగా ఒప్పుకుంటారా..? అని ప్రశ్నించగా.. ఏం కాదు.. నేను ఒప్పుకోను అని రేవంత్ రెడ్డి బదులిచ్చాడు.

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): చిన్న, చిన్న మార్పులు చేసుకుంటా అని తెలిపారు. అంటే రేవంత్ రెడ్డికి కూడా తెలిసింది.. 14న ఎగిరేది గులాబీ జెండా అని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం 14 ఏండ్ల పాటు కొట్లాడినం. 10 ఏండ్లు అధికార పార్టీగా సేవలందించాం. హైదరాబాద్ మహానగరంలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఓటు వేయకుండా మొత్తం బీఆర్ఎస్‌ను గెలిపించారు. ఈ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

8.11.2025

మేషం: సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కార మౌతాయి. సన్నిహితులతో సఖ్యత కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. దూరప్రాంతాల బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.

వృషభం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వ్యాపార, ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు. చేపట్టిన పనులు ముందుకు సాగవు. దూర ప్రయాణాలు వలన శ్రమాధిక్యత పెరుగుతుంది. బంధువులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి.

మిధునం: చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి.

కర్కాటకం: విద్యార్థులకు నిరుత్సాహం తప్పదు. మిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు వలన మానసిక ప్రశాంతత ఉండదు. ఆరోగ్యం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

సింహం: కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చూడతారు. బంధువులతో వివాదాల పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. సన్నిహితుల నుండి శుభవార్తలు అవుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి.

కన్య: గృహమున చిత్రమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు.

తుల: విద్యార్థుల ప్రయత్నాలు కొంత నిరాశ ఇస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. వృత్తి, వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. నిరుద్యోగులకు ఒక వార్త ఊరటనిస్తుంది. ఆర్థిక లావాదేవీలు మందగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమ పెరుగుతుంది.

వృశ్చికం: ఇంటా బయట బాధ్యతలు మరింత పెరుగుతాయి. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు మానసిక సమస్యలు కలిగిస్తాయి. కుటుంబ వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు.

ధనస్సు: వ్యాపార, ఉద్యోగాలలో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాల్లో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.

మకరం: సన్నిహితులతో విందువినోద కార్యకమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగయోగం ఉన్నది. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన విధంగా ముందుకు సాగుతాయి. సన్నిహితులతో వివాదాలు తీరతాయి. నూతన భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

కుంభం: కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో చికాకులు పెరుగుతాయి. ఆర్థిక లావాదేవీలు మందకొడిగా సాగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది.

మీనం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో స్వల్ప ఆటంకాలు తప్పవు. ఆర్థిక ఇబ్బందులుంటాయి. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు చికాకు పరుస్తాయి. నూతన రుణ ప్రయత్నాలు చేస్తారు.

# వందేమాతరం.. భవిష్యత్తుకు ధైర్యం

**గేయంలోని పదాలు ఒక మంత్రం.. ఒక శక్తి.. ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఆయుధం.. ప్రధాని నరేంద్రమోదీ వెల్లడి.. తపాలా బిళ్ల, నాణెం ఆవిష్కరణ**

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి నేటితో 150 ఏళ్లు. ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో స్మారక కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఒక తపాలా బిళ్ళ, నాణెంను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మోదీ కీలక ప్రసంగం చేశారు. ఈ స్మారక కార్యక్రమం నవంబర్ 7, 2025 నుండి నవంబర్ 7, 2026 వరకు దేశవ్యాప్తంగా జరుగుతుంది. వందేమాతరం అనేది కేవలం ఒక పదం కాదు, ఒక సంకల్పం కూడా అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జాతీయ గీతం మన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అన్నారు. సాధించలేని సంకల్పం ఏదీ లేదని ఆయన అన్నారు. వందేమాతరం అనేది సరస్వతి దేవికి చేసే ప్రార్థన. వందేమాతరం భవిష్యత్తుకు ధైర్యాన్ని కూడా ఇస్తుందని ఆయన అన్నారు. "వందేమాతరం, ఈ పదాలు ఒక మంత్రం, ఒక శక్తి, ఒక కల, ఒక సంకల్పం. వందేమాతరం, ఈ పదాలు భారతమాత పట్ల భక్తి, భారతమాత పట్ల



ఆరాధన. వందేమాతరం, ఈ పదాలు మనల్ని చరిత్రలోకి తీసుకెళ్తాయి, అవి మన వర్తమానాన్ని కొత్త ఆత్మవిశ్వాసంతో నింపుతాయి. సాధించలేని సంకల్పం లేదని, మనం భారతీయులు సాధించలేని లక్ష్యం లేదని మన భవిష్యత్తుకు కొత్త ధైర్యాన్ని ఇస్తాయి" అని ప్రధాని మోదీ అన్నారు. వందేమాతరం ఈ సామూహిక గానం అద్భుతమైన అనుభవం నిజంగా వ్యక్తీకరణకు మించినది. చాలా స్వరాలు, ఒక లయ, ఒక స్వరం, ఒక భావోద్వేగం, ఒక థ్రిల్, ఒక ప్రవాహం, అంత పొందిక, అంత అల.. ఈ శక్తి హృదయాన్ని ఉప్పొంగేలా చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# వీర్యం వీక్!

మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా వాయు కాలుష్యం, అధిక వేడి కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. "పురుషుల్లో సంతానోత్పత్తి అనేది కేవలం వ్యక్తిగత సమస్య కాదు, అది మన గ్రహం మొత్తం ఆరోగ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రపంచం వేడెక్కుతున్న కొద్దీ, పట్టణీకరణ పెరుగుతున్న కొద్దీ ఈ నిగూఢ ముప్పును గుర్తించి, పరిష్కరించడం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరం" అని ఫరీదాబాద్‌లోని ఫోర్టిస్ ఎస్కార్ట్స్ హాస్పిటల్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ నీతి కౌశిష్ తెలిపారు. భారతదేశంలో వాయు కాలుష్యం ఎప్పటినుంచో ప్రజారోగ్య సమస్యగా ఉంది. శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులకు ఇది కారణమవుతుందని మనకు తెలుసు. అయితే, ఇటీవలి పరిశోధనలు ఇది పురుషుల పునరుత్పత్తి వ్యవస్థను కూడా దెబ్బతీస్తుందని స్పష్టం చేస్తున్నాయి. 'గాలిలోని సూక్ష్మ ధూళి కణాలు (పీఎం 2.5), నైట్రోజన్ డయాక్సైడ్ వంటి విష వాయువులు వీర్య కణాల సంఖ్య, చలనాన్ని తగ్గిస్తాయని తేలింది. వీటిని పీల్చినప్పుడు అవి రక్తంలో కలిసి ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను పెంచుతాయి. ఇది వీర్య కణాల డీఎన్‌ఏను దెబ్బతీయడంతో పాటు, హార్మోన్ల పనితీరును అడ్డుకుంటుంది" అని డాక్టర్ కౌశిష్ వెల్లడించారు. 2022లో ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ పర్‌స్పెక్టివ్స్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, అధిక పీఎం 2.5 కాలుష్యానికి గురైన వారిలో వీర్య కణాల చలనం గణనీయంగా తగ్గినట్లు తేలింది. అదేవిధంగా, చైనా, ఇటలీలలో జరిపిన పరిశోధనల్లో, కాలుష్య నగరాల్లో నివసించే పురుషుల్లో వీర్య కణాల నాణ్యత, గ్రామీణ ప్రాంతాల్లోని వారితో పోలిస్తే 15-25% తక్కువగా ఉన్నట్లు వెల్లడైంది.

### పెరుగుతున్న వేడి.. పెను ముప్పు

కాలుష్యం వీర్య కణాలను అంతర్గతంగా దెబ్బతీస్తుంటే, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మరోవైపు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. 'వృషణాలు శరీర సాధారణ ఉష్ణోగ్రత కంటే కొంచెం తక్కువ ఉష్ణోగ్రత వద్ద ఉత్తమంగా పనిచేస్తాయి. అందుకే అవి శరీరం వెలుపల ఉంటాయి. కానీ, గ్లోబల్ వార్మింగ్, వేడి వాతావరణంలో పనిచేయడం, బిగుతైన దుస్తులు ధరించడం వంటివి వృషణాల ఉష్ణోగ్రతను పెంచి వీర్య కణాల ఉత్పత్తిని దెబ్బతీస్తాయి' అని నిపుణులు తెలిపారు. పలు అధ్యయనాల ప్రకారం, వృషణాల ఉష్ణోగ్రత కేవలం 1 డిగ్రీ సెల్సియస్ పెరిగినా వీర్య కణాల ఉత్పత్తి, చలనం 40% వరకు తగ్గుతుంది. ఫ్యాక్టరీలు, నిర్మాణ రంగం, ఫౌండ్రీలలో పనిచేసే కార్మికులకు ఈ ప్రమాదం మరింత ఎక్కువ. భారత్‌లో తరచూ సంభవిస్తున్న వడగాలులు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. 'కాలుష్యం, వేడి రెండూ కలిసి పురుషుల సంతానోత్పత్తి సామర్థ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం' అని వైద్యులు నొక్కిచెప్తున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ -2023లో జరిపిన అధ్యయనంలో, కాలుష్యం, అధిక వేడికి గురైన పురుషులలో వీర్య కణాల డీఎన్‌ఏ దెబ్బతినడం, హార్మోన్ల అసమతుల్యత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వ్యక్తిగత జాగ్రత్తలతో పాటు వాయు నాణ్యత ప్రమాణాలను కఠినతరం చేయడం, పట్టణాల్లో వేడిని తగ్గించే పద్ధతులను ప్రోత్సహించడం వంటి ప్రభుత్వ చర్యలు అత్యవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పురుషుల సంతానోత్పత్తి ఆరోగ్యం అనేది వైద్య సమస్యే కాదని.. అది పర్యావరణ సమస్య కూడా అని పేర్కొంటున్నారు.

**పురుషులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

- వడగాలుల సమయంలో అధిక ఉష్ణోగ్రతలకు దూరంగా ఉండటం.
- వదులుగా ఉండే, గాలి ఆడే దుస్తులు ధరించడం.
- వేడి ప్రదేశాల్లో పనిచేసేవారు చల్లని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవడం, తగినంత నీరు తాగడం ఉత్తమం.
- ధూమపానం, అధిక మద్యపానానికి దూరంగా ఉండటం.
- పండ్లు, కూరగాయలు, నట్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఆహారం తీసుకోవడం.

# బనకచర్లకు బ్రేక్!

**తాజాగా టెండర్లు రద్దు చేస్తూ నిర్ణయం**

అమరావతి, నవంబర్ 7 (ఈవార్తలు): బనకచర్ల ప్రాజెక్ట్ డీపీఆర్ కోసం పిలిచిన టెండర్లను ఏపీ సర్కారు రద్దు చేసింది. అక్టోబర్ 11వ తేదీన బనకచర్ల ప్రాజెక్ట్ డీపీఆర్ కోసం టెండర్లను ఆహ్వానించిన సర్కారు.. టెండర్ల దాఖలుకు అక్టోబర్ 31వ తేదీ వరకు గడువుగా నిర్ణయించింది. అయితే, తాజాగా డీపీఆర్ కోసం ఆహ్వానించిన టెండర్లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం నేపథ్యంలో డీపీఆర్ టెండర్ల రద్దు ఆసక్తికరంగా మారింది. వివాదాల కారణంగా బనకచర్ల డీపీఆర్ టెండర్లను రద్దు చేశారా? లేదా టెండర్లు రాక పోవడంతో రద్దు చేశారా? అనే విషయం తెలియాల్సి ఉంది. కాగా, బనకచర్ల ప్రాజెక్టు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేర్కొనగా.. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలు లేవనెత్తింది.. దీనిపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.. అయినా.. ఏపీ సర్కార్ టెండర్లకు వెళ్లినా.. ఇప్పుడు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. దాదాపు రూ.80వేల కోట్లకు పైగా వ్యయంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టు చేపట్టాలని చంద్రబాబు భావించారు. పోలవరం ప్రాజెక్ట్ ద్వారా గోదావరి నదిలో లభ్యమయ్యే అదనపు నీటిని కృష్ణా నది పరివాహక ప్రాంతాలకు మళ్లించడం కోసం కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. గోదావరి నీటిని బనకచర్ల రిజర్వాయర్‌కు మళ్లించి, అక్కడి నుంచి రాయలసీమ జిల్లాలకు (ప్రత్యేకంగా కర్నూలు, అనంతపురం) సాగు నీరు, తాగునీరు అందించాలన్నది ప్రధాన ఉద్దేశం. రాయలసీమలో తరచూ ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను తగ్గించడం కోసం ఈ లింక్ ప్రాజెక్ట్ కీలకమవుతుందని చంద్రబాబు చెబుతూ వచ్చారు.

# విమానాల సిగ్నల్ వీక్!

మొదటి పేజీ తరువాయి

సరిపడినంత స్థలం లేనందున పలు సర్వీసులు రద్దు చేసినట్లు ఎయిర్ పోర్ట్ వర్గాలు వివరించాయి. అయితే గురువారం సాయంత్రం నుంచే ఏటీసీలో ఈ సమస్య ఉత్పన్నమైందని వెల్లడించాయి. ఇక అందుబాటులో ఉన్న డేటా అధారంగా పలు విమానాల సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపింది. ఆ క్రమంలో చాలా ఆలస్యంగా విమాన సర్వీసుల నడుస్తున్నాయంది. మరోవైపు ముంబై ఎయిర్‌పోర్ట్‌లోనూ ఏటీసీ వ్యవస్థ కుప్పకూలింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. న్యూఢిల్లీ ఎయిర్‌పోర్టు నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రతి రోజు ఇక్కడి నుంచి దాదాపు 1,500 విమానాలు రాక పోకలు సాగిస్తాయి. ట్రాకింగ్ వెబ్ సైట్‌లో విమాన సర్వీసు బయలుదేరు సమయం దాదాపు 60 నిమిషాలు ఆలస్యం చూపించింది. ఏటీసీ వ్యవస్థలో ఏర్పడిన లోపం కారణంగా.. అన్ని విమాన సర్వీసుల రాకపోకలపై ఈ ప్రభావం పడిందని స్పైస్ జెట్ ఎయిర్ లైన్స్ వెల్లడించింది. అదే విధంగా ఎయిర్ ఇండియా సంస్థ సైతం స్పందించింది. ఈ ఊహించని అంతరాయం కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపింది. విమాన సర్వీసుల ఆలస్యంపై సోషల్ మీడియా వేదికగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

# కేటీఆర్, కిషన్ బ్యాడ్ బ్రదర్స్

మొదటి పేజీ తరువాయి

అంశాలను ప్రస్తావిస్తూ.. కేటీఆర్, కిషన్‌రెడ్డిల పాత్రను ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ వంటి ముఖ్య ప్రాజెక్టులను ఈ 'బ్యాడ్ బ్రదర్స్' కుట్రపూరితంగా అడ్డుకుంటున్నారని సీఎం ఆరోపించారు. హైదరాబాద్ ప్రజలు వీరిద్దరినీ అభివృద్ధి నిరోధకులుగా పరిగణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మెట్రో రైలు, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), అంతర్జాతీయ విమానాశ్రయం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రధాన ప్రాజెక్టులను తీసుకొచ్చి హైదరాబాద్‌ను గ్రోత్ ఇంజిన్‌గా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. గతంలో టీడీపీ ప్రభుత్వ సహకారం కూడా ఉందని గుర్తు చేశారు. హైదరాబాద్ వరదల్లో మునిగిపోయినప్పుడు కేంద్రం నుంచి చిల్లి గవ్వ కూడా తీసుకురాలేకపోయిన కిషన్‌రెడ్డి.. ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. అలాగే.. సచివాలయంలో దేవాలయం కూల్చివేసినప్పుడు కూడా కిషన్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారు? అని నిలదీశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన తెలంగాణ రాష్ట్రాన్ని రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిందని రేవంత్ రెడ్డి విమర్శించారు.

రూ. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లలోనే కూలిపోయిందని.. ఈ సొమ్మును గోదావరిలో పోశారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్ర సంపదను కొల్లగొట్టి ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుందని.. అక్రమ సంపాదనకు పాల్పడిందని విమర్శించారు. ప్రతిపక్షాలపై నిఘా పెట్టేందుకే కమాండ్ కంట్రోల్ రూమ్‌ను నిర్మించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్లాన్ చేస్తున్నామని చెబుతూ.. జూబ్లీహిల్స్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని.. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# విద్యార్థుల జీవితాలను బలి చేస్తావా?

మొదటి పేజీ తరువాయి

ఇచ్చిన హామీకే విలువ లేకుంటే ఇక అసెంబ్లీకి విలువ ఏముంది?' అని రేవంత్ రెడ్డిని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే తెలంగాణ రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని రేవంత్ రెడ్డే చెప్పారు కదా? అని గుర్తుచేశారు. ఇప్పుడు అందుకు భిన్నంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం దుర్మార్గం అని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే కాలేజీలు ఎట్లా నడవాలి? అధ్యాపకులకు జీతాలివ్వకపోతే విద్యార్థులకు చదవు చెప్పేదెవరు? కాలేజీ యాజమాన్యాలపై రేవంత్ రెడ్డికి ఉన్న కోపంతో విద్యార్థుల జీవితాలను బలి చేయాలనుకుంటున్నారా? ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోంది' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. చట్టం పేరుతో బెదిరింపులకు పాల్పడితే పాలన నడవదనే విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని సూచించారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించి చట్టం గురించి మాట్లాడితే మంచిది అని రేవంత్ రెడ్డికి బండి సంజయ్ హితవు పలికారు.

# నా ముందే పరాచికాలా?

మొదటి పేజీ తరువాయి

ఇవ్వమంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్ తో ప్రైవేట్ కాలేజీలు ఆటలాడొద్దని హెచ్చరించారు. విద్యార్థుల పట్ల ఓవరాక్షన్ చేస్తే సహించేదని వార్నింగ్ ఇచ్చారు. విద్యార్థులను ఇబ్బంది పెడ్తే.. ఏం చేయాలో మాకు కూడా తెలుసన్నారు. కాలేజీల్లో విద్యా ప్రమాణాలు పరిశీలించేందుకు అధికారులు వెళ్తే తప్పా అని నిలదీశారు. ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు అడిగినవి ఇవ్వనందుకు ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. స్కూళ్లు, కాలేజీలు బంద్ పెట్టి నిరసన చేస్తే సహించేదని వార్నింగ్ ఇచ్చారు. విద్య అంటే వ్యాపారం కాదని.. విద్య అంటే సేవ అని అన్నారు. కానీ ఒక్కో కాలేజీ విచ్చలవిడిగా ఫీజులు పెంచుకుని వచ్చాయని.. ఆ కాలేజీల ఫీజులు లిస్ట్ చూస్తే నేనే షాక్ అయ్యానని అన్నారు. నిబంధనల ప్రకారం కాలేజీలు నడపరు కానీ ఫీజులేమో కావాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కాలేజీలు తెరుస్తాం..

మొదటి పేజీ తరువాయి

బకాయిలు రావాల్సి ఉందని ప్రస్తావించారు. వారి విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న భట్టి విక్రమార్క, ప్రభుత్వం తరఫున కీలక హామీలతో సమస్యను సత్వరం పరిష్కరించారు. తమ ప్రభుత్వం ఇప్పటికే రూ. 600 కోట్లు విడుదల చేసిందని తెలియజేశారు. అంతేకాకుండా, తక్షణమే మరో రూ. 600 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. మిగిలిన రూ. 300 కోట్లను కూడా త్వరలోనే విడుదల చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ విధంగా, యాజమాన్యాలు కోరిన పూర్తి బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. బకాయిల చెల్లింపుతో ప్రస్తుత సమస్య పరిష్కారమైనప్పటికీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల విషయంలో భవిష్యత్తులో ఇలాంటి ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. దీనిలో భాగంగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేసి, సకాలంలో పారదర్శకంగా చెల్లింపులు జరిగేలా కొత్త మార్గదర్శకాలను సూచించడానికి త్వరలోనే ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

# రేవంత్‌కు తెలిసిపోయింది

మొదటి పేజీ తరువాయి

మాగంటి గోపీనాథ్‌ని గెలిపించారు. ఒక్క సీటును కూడా ఇవ్వలేదు కాంగ్రెస్ పార్టీకి అని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ 25 ఏండ్ల కాలంలో ఎంతో మంది సీఎంలను చూశాం. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి కేసీఆర్, రేవంత్ రెడ్డి ఆరుగురు సీఎంలను 25 ఏండ్లలో చూశాం. ప్రజల ఇష్టం బట్టి అధికార మార్పిడి జరుగుతుంది. హైదరాబాద్ అభివృద్ధి కోసం చంద్రబాబు, వైఎస్సార్ ప్రయత్నించారు. తర్వాత రోశయ్య, కిరణ్ శక్తివంచన లేకుండా ప్రయత్నించారు. ఎందుకంటే వారికి విజ్ఞత ఉండే.. అధికారంలో ఉన్నప్పుడు మంచి చేయాలని అని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పరిశ్రమలను, ఐటీని పెంచుకున్నాం. 2014లో 3 లక్షల 20 వేల మంది ఐటీ ఉద్యోగుల ఉంటే.. 2023 నాటికి 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులను సృష్టించాం. ఐటీ ఎగుమతుల్లో బెంగళూరు నగరాన్ని దాటాం. 2014లో ఐటీ ఎగుమతులు 57 వేల కోట్లు.. 2023 నాటికి 2 క్షల 40 వేల కోట్లకు తీసుకెళ్లాం. అంతేకాకుండా రియల్ ఎస్టేట్ పెరిగింది. అభివృద్ధిలో దూసుకుపోయింది. దేశానికి ఆదర్శంగా నిలబడింది హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రం. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతితో పల్లెలను, పట్టణాలను బాగు చేసుకున్నాం. 350 బస్తీ దవఖానాలు కట్టుకున్నామని కేటీఆర్ తెలిపారు.

# వీధికుక్కలు ఉండొద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అన్ని రాష్ట్రాలూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆ డ్రైవ్‌పై 8 వారాల్లో స్టేటస్ రిపోర్ట్ అందించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వీధికుక్కలను పట్టుకున్న ప్రాంతాల్లో తిరిగి వదలొద్దని, సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని సుప్రీం నుంచి కీలక ఆదేశాలందాయ్. ఈ ఏడాది ఆగస్టు 11న, జస్టిస్ పార్దివాలా, ఆర్. మహదేవన్‌తో కూడిన ధర్మాసనం కుక్కల దాడులను సీరియస్‌గా తీసుకుంది. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్, ఫరీదాబాద్‌లో ఉన్న వీధికుక్కలను షెల్టర్ హోమ్‌లకే పరిమితం చేయాలని ఆదేశించింది. అయితే జంతు ప్రేమికులు కోర్టు తీర్పును నిరసిస్తూ విషయాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. సంస్థాగత ప్రాంతాల్లో కుక్కకాటు కేసులు పెరిగిపోతుండటాన్ని తీవ్రంగా పరిగణించింది.

# హీరోలను రేవంత్ జైల్లో పెట్టారు!

**మాజీమంత్రి హరీశ్ రావు విమర్శలు.. ఓట్ల కోసం ఒంగి ఒంగి దండాలు పెడుతున్నారని ఎద్దేవా.. కాంగ్రెస్‌కు ఓటేస్తే మూడేళ్లు నరకమేనని వెల్లడి**

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): సినిమా హీరోలను జైల్లో పెట్టిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు సినిమా కార్మికులకు ఒంగి ఒంగి దండాలు పెడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు విమర్శించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన 'మీట్ ది ప్రెస్'లో మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మూడేళ్ల పాటు నరకయాతన తప్పదని హెచ్చరించారు. వికాసానికి, విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలు తమకు ఏది కావాలో తేల్చుకోవాలని కోరారు. రేవంత్ రెడ్డి పాలనలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పాలనలో నలుగురు సోదరులు మాత్రమే సంతోషంగా ఉన్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను రేవంత్ రెడ్డి విస్మరించారని ధ్వజమెత్తారు. ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసి జూబ్లీహిల్స్‌లో ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే రేషన్ కార్డులు ఆగిపోతాయని, పెన్షన్ పెరగదని చెప్పడం సరికాదని హితవు పలికారు. కంటోన్మెంట్‌లో 6 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఏమయ్యాయో చెప్పాలని ఆయన నిలదీశారు.




ప్రజలను మభ్యపెట్టి కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని విమర్శించారు. రెండేళ్లుగా అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వని కాంగ్రెస్, జూబ్లీహిల్స్ ఎన్నికలు వచ్చాయని ఇప్పుడిచ్చిందని ఆరోపించారు. పీజేఆర్ మీద రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి అంతగా అభిమానం ఉంటే 2023లో పీజేఆర్ కుమారుడికి టిక్కెట్ ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నించారు.

### రేవంత్‌ను ఎర్రగడ్డలో చేర్పించాల్సిన బాధ్యత జూబ్లీహిల్స్ ప్రజలదే

పటాన్‌చెరు నియోజకవర్గంలోని కొల్లూరు కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. నిన్న మంత్రి ఉత్తమ్ రెడ్డి ఇక్కడికి వస్తే కుర్చీలు ఖాళీ ఉన్నాయి.. మన మీటింగ్‌కు మూడుసార్లు కుర్చీలు తెప్పించినా సరిపోవడం లేదని సెటైర్ వేశారు. కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్స్‌కు పేరు కేసీఆర్ నగర్ అనే పేరు పెట్టుకున్నాం.. ఇన్ని ఇళ్లు చూసి అబ్బా కేసీఆర్ ఇంత పెద్ద ఇల్లు కట్టాడా? అని ఆశ్చర్య పోయారట. ఇన్ని రోజులు మంత్రులు వచ్చారా? అని అడిగారు. మాగంటి గోపీనాథ్ భార్య కన్నీళ్లు పెట్టుకుంటే కాంగ్రెస్ నాయకులు దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ వాళ్ళు చనిపోతే భార్యలు ఏడుస్తారా లేదా? అని ప్రశ్నించారు. ఆ తల్లిని పట్టుకుని దుర్మార్గంగా మాట్లాడారు. ఆలోచన చేయండి.. సిగ్గు లేకుండా ఓట్లు అడుగుతున్నారని అన్నారు. అది ఇస్తాం, ఇది ఇస్తాం అని ప్రలోభాలు చేస్తున్నారు. అన్నం పెట్టిన కేసీఆర్‌ను మర్చిపోతమా? అని అన్నారు. కలలో కూడా కలగనని ఇళ్లలో ఉంటామని అనుకోలేదు.. మీ ఓట్లు ఖాయంగా కేసీఆర్‌కే అని అర్థం అయ్యింది.. మీ బంధువులకు కూడా చెప్పి కేసీఆర్‌కు కారుకు ఓటేయమ్మని చెప్పండి అని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు రెఫరెండం అని చెప్పే ధైర్యం లేదు.. మంత్రులు జూపల్లి కృష్ణారావుకు, పొన్నం ప్రభాకర్‌కు జూబ్లీహిల్స్ ఓటర్లు చుక్కలు చూపించారు.. ఓటుకు రూ.3వేలు ఇస్తామని కాంగ్రెస్ చెబుతున్నది. తీసుకుని మిగతా రెండేళ్లలో ఇస్తామన్న డబ్బులు కూడా అడగండని చెప్పారు. రూ.2,500 లేదు, మహాలక్ష్మి స్కీమ్ లేదు, తులం బంగారం లేదు, స్కూటీ లేదు.. సిగ్గు లేకుండా మళ్ళీ ఏదో చేస్తా అని రేవంత్ రెడ్డి చెబుతున్నాడని విమర్శించారు. తులం బంగారం అడిగితే ఓ నేత లక్ష దాటింది ఎక్కడ ఇస్తాం అని మాట్లాడుతున్నాడు. మరి అలాంటప్పుడు హామీ ఎందుకు ఇచ్చారని సీరియస్ అయ్యారు. రేవంత్ రెడ్డికి కేసీఆర్ చేసిన అభివృద్ధి కనపడటం లేదంటే.. ఆయన అంధుడు అయినా ఉండాలే.. లేదంటే పిచ్చోడు అయినా అయి ఉండాలి. పిచ్చోడు అయితే జూబ్లీహిల్స్ ప్రజలు ఎర్రగడ్డలో చేర్చాలని సూచించారు. హిందూ అయినా ముస్లిం అయినా కేసీఆర్‌కు ఒక్కటేనని అన్నారు.

## బండి సంజయ్‌పై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా బండి సంజయ్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి మాట్లాడారని కాంగ్రెస్ పేర్కొంది. ఈ మేరకు పీసీసీ ఎన్నికల కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు అందజేసింది. నిన్న జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బండి సంజయ్, ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే తులం బంగారం ఇవ్వడమేమో కానీ, ప్రజల వద్ద ఉన్న బంగారాన్ని కూడా గుంజుకుంటారని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఎన్నో అవినీతి ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక కేసీఆర్ కుటుంబాన్ని ఒక్క కేసులో కూడా ఎందుకు జైల్లో పెట్టలేదని ప్రశ్నించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.

## వీళ్లేం సెలబ్రిటీలు?

**రైనా, శిఖర్ ధావన్‌లపై సజ్జనార్ తీవ్ర ఆగ్రహం**



హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): ప్రముఖ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌పై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అసహనం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో వీరికి చెందిన రూ. 11 కోట్ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ఈ మేరకు వార్తా కథనాన్ని తన సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా పంచుకున్న సజ్జనార్, "వీళ్ళేం సెలబ్రిటీలు?" అంటూ వ్యాఖ్యానించారు. అభిమానాన్ని కూడా సొమ్ము చేసుకునే వీరు ఆదర్శనీయమైన ఆటగాళ్లు ఎలా అవుతారని ఆయన ప్రశ్నించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ మహమ్మారికి బానిసలై ఎంతోమంది యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని సజ్జనార్ ఆవేదన వ్యక్తం చేశారు. వేలాదిమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. సమాజాన్ని ఛిద్రం చేస్తోన్న బెట్టింగ్ భూతాన్ని ప్రోత్సహించిన ఈ క్రికెటర్లు కూడా బాధ్యులేనని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజానికి మేలు చేయడానికి, యువత ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి సెలబ్రిటీలు మంచి మాటలు చెప్పాలని హితవు పలికారు. అభిమానించే వారిని తప్పుదోవ పట్టించి, వారి ప్రాణాలను తీయడానికి కారణం కావొద్దని సూచించారు.

## గ్రహణం వీడాలి.. కేసీఆర్ రావాలి

**రాష్ట్రానికి, హైదరాబాద్‌కు కాంగ్రెస్ గ్రహణంలా పట్టిందన్న కేటీఆర్**



హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి, ప్రత్యేకంగా హైదరాబాద్ నగరానికి పట్టిన గ్రహణం వీడాలంటే మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఈరోజు తన ఎక్స్ ఖాతాలో ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ అభివృద్ధి అప్రతిహతంగా కొనసాగిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ పదేళ్లలో ఐటీ, ఫార్మా సహా అన్ని రంగాలు వేగంగా అభివృద్ధి చెందాయని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వెల్లువెత్తాయని, శాంతిభద్రతల పరిరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు ప్రతీ అంశంలోనూ తమ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసిందని పేర్కొన్నారు. ఆ అభివృద్ధి ఫలాలు నగరంలోని ప్రతి పౌరుడికీ అందాయని, హైదరాబాద్ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టామని ఆయన కొనియాడారు. అయితే, గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నగరం కీర్తి మసకబారిందని కేటీఆర్ విమర్శించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. "రాష్ట్రానికి, హైదరాబాదుకు పట్టిన ఈ గ్రహణం వీడాలి. మళ్లీ కేసీఆర్ రావాలి" అంటూ తన పోస్టులో పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కేంద్ర బలగాలను దింపాలి: బీఆర్ఎస్

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు మరో నాలుగు రోజులే మిగిలి ఉండగా.. అధికార, ప్రతిపక్ష పార్టీల ఎన్నికల ప్రచారాలతో.. వాడీ వేడీ మాటల యుద్ధాలతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఉపఎన్నిక నేపథ్యంలో నేడు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో బీఆర్ఎస్ ఎంపీలు సురేష్ రెడ్డి, దామోదర్ రావులు సమావేశం అయ్యారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమాలకు పాల్పడుతోందని ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో సహా, మంత్రులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థ కూడా అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సజావుగా సాగాలంటే.. కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

## నాపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం: తుమ్మల



హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): బీఆర్ఎస్ తనపై తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సీరియస్ అయ్యారు. ఈ మేరకు తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై సైబర్ క్రైమ్ పోలీసులకు కంప్లైంట్ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలంటూ కమ్మ సంఘాలకు తాను చెప్పినట్లు బీఆర్ఎస్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ప్రజలను మెప్పించి ఎన్నికల్లో గెలవాలని కానీ.. ఇలా తప్పుడు ప్రచారాలతో కాదని మంత్రి తుమ్మల హితవు పలికారు. తప్పుడు వార్తలను నమ్మొద్దని కమ్మ సంఘాలు, కాంగ్రెస్ నేతలకు పిలుపునిచ్చారు. కాగా, జూబ్లీహిల్స్ ఉపఉన్నికలు హీట్ పెంచుతున్నాయి. గెలుపు కోసం అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పడరాని పాట్లు పడుతున్నాయి. మూడు పార్టీలు సర్వ శక్తులను ఒడ్డి ప్రచారం చేస్తున్నాయి. పోలింగ్‌కు కేవలం నాలుగు రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉండడంతో ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి.

## రాష్ట్రంలో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ 85వ సదస్సు

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు):తెలంగాణకు మరో అరుదైన గౌరవం దక్కింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్సీ) 85వ వార్షిక సదస్సును వచ్చే ఏడాది హైదరాబాద్‌లో నిర్వహించడానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి... కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. 85వ సదస్సు తెలంగాణలో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అవకాశం కల్పించాలని లేఖలో కోరారు. ఈ సదస్సు నిర్వహణకు కేంద్ర అంగీకారం కోసం మంత్రి నిరంతర సంప్రదింపులు చేశారు. సానుకూలంగా స్పందించిన నితిన్ గడ్కరీ... శుక్రవారం భువనేశ్వర్ లో జరుగుతున్న 84వ ఐఆర్సీలో ఈ మేరకు ప్రకటన చేశారు. 2026 సదస్సు హైదరాబాద్ లోనే జరగనున్నట్లు తెలిపారు. సదస్సు నిర్వహణతో రాష్ట్రంలో కీలక ప్రాజెక్టులకు ప్రయోజనం చేకూరనుందని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించినందుకు కేంద్ర మంత్రి గడ్కరీ, కేంద్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎప్పటికప్పుడు తమ సూచనల మేరకు సదస్సు నిర్వహణపై మానిటరింగ్ చేసిన ఆర్ అండ్ బి ఈఎన్సీ మోహన్ నాయక్, ఇతర అధికారులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

## సొంత చెల్లి, మాగంటి తల్లికి కేటీఆర్ మోసం: సీతక్క

**ఓటమి భయంతోనే హరీశ్ రావు ప్రచారం చేస్తున్నారని విమర్శ**

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరి హడావిడి చూస్తుంటే బీఆర్ఎస్‌కు ఓటమి ఖాయమని అర్థమవుతోందని ఆమె ఎద్దేవా చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆమె, కేటీఆర్, హరీశ్ రావుల తీరుపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ తన సొంత చెల్లితో పాటు మాగంటి తల్లిని కూడా మోసం చేశారని సీతక్క ఆరోపించారు. "మాగంటి తల్లి ఆవేదన చూస్తే కేటీఆర్ ఎంత మోసకారో స్పష్టమవుతోంది. 91 ఏళ్ల వృద్ధురాలని కూడా చూడకుండా ఆమెను అవమానపరిచారు. ఈ ఆరోపణలపై కేసీఆర్ సమాధానం చెప్పాలి. కేటీఆర్ తీరును తెలంగాణ మహిళలందరూ గమనించాలి" అని ఆమె కోరారు. అనంతరం హరీశ్ రావుపై విమర్శలు గుప్పించారు. "నిశ్శబ్ద విప్లవం అని హరీశ్ రావు ప్రగల్భాలు పలుకుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే మాట అన్నారు. కానీ ఆ నిశ్శబ్ద విప్లవమే మిమ్మల్ని నిండా ముంచింది. నిన్నటి వరకు విషాదంలో ఉన్న ఆయన, ఇప్పుడు హడావుడిగా బయటకు వచ్చి ఎందుకు ప్రచారం చేస్తున్నారు? ఓటమి భయంతోనే 24 గంటలు గడవకముందే ప్రచారానికి వచ్చారు" అని సీతక్క విమర్శించారు. ఓటమి తప్పదని తెలిసి వాస్తవాలు దాచిపెట్టి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై కూడా సీతక్క తీవ్ర విమర్శలు చేశారు. "తెలంగాణలో వైన్, మైన్, ల్యాండ్, శాండ్ మాఫియాలతో మీరు విధ్వంసకర పాలన సాగించారు. అందుకే గత ఎన్నికల్లో ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పారు. పదేళ్లలో కనీసం ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వని దుష్ట పాలన కేసీఆర్‌ది. మీరు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విడిపిస్తోంది" అని అన్నారు. తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం వంటి పథకాలతో ప్రజల సమస్యలను పరిష్కరిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా నగరాన్ని ముంచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆమె ఆరోపించారు.

## 2029 మహిళల వరల్డ్ కప్‌లో 10 జట్లు

**ఐసీసీ కమిటీలోకి మిథాలీ రాజ్**

మహిళల వన్డే వరల్డ్ కప్‌ను విస్తరించాలని ఐసీసీ నిర్ణయించింది. ఇప్పటివరకు మహిళల వరల్డ్ కప్‌లో 8 జట్లే పాల్గొన్నాయి. ఇటీవల జరిగిన ప్రపంచకప్‌లోనూ 8 జట్లే ఆడాయి. కానీ 2029లో జరిగే ప్రపంచకప్‌లో 10 జట్లు పాల్గొనబోతున్నాయి. ఈ విషయాన్ని ఐసీసీ శుక్రవారం వెల్లడించింది. 'మహిళల వరల్డ్ కప్‌ను 10 జట్లకు విస్తరించడానికి ఐసీసీ బోర్డు అంగీకరించింది. మహిళల ప్రపంచకప్‌ను దాదాపు 3 లక్షల మంది వీక్షించారు. ఇది ఏ మహిళల క్రికెట్ ఈవెంట్‌లోనైనా రికార్డు. అలాగే, టీవీ, డిజిటల్‌లో కూడా వ్యూయర్‌షిప్‌లో కొత్త రికార్డులను సృష్టించింది. ఇండియాలో దాదాపు 500 మిలియన్ల వ్యూయర్స్ వీక్షించారు.'అని ఐసీసీ తెలిపింది. ఇటీవల ముగిసిన వరల్డ్ కప్‌లో 31 మ్యాచ్‌లు జరిగాయి. 2029 వరల్డ్ కప్‌లో జట్లను 10కి పెంచడంతో మ్యాచ్‌ల సంఖ్య 48కి పెరగనుంది. అటు.. మహిళల క్రికెట్ కమిటీ సభ్యుల నియామకాన్ని ఐసీసీ ఆమోదించింది. భారత దిగ్గజ క్రీడాకారిణి మిథాలీ రాజ్‌ను ఐసీసీ కమిటీలోకి తీసుకుంది. అలాగే, భారత మహిళల జట్టు క్రికెట్ జట్టు హెడ్ కోచ్ అమోల్ మజుందార్‌ను కూడా మెంబర్‌గా నియమించింది.

# తెలంగాణ రోల్ మోడల్

**ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నం.1.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**




హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తెలంగాణ నిలిచిందని.. ఇక్కడ అవకాశాలు పుష్కలమని.. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అమెరికా-యూటా పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్-యూటా ఎండీ, సీవోవో డేవిడ్ కార్లెబాగ్ నేతృత్వంలోని యూటా పారిశ్రామికవేత్తల బృందం శుక్రవారం సెక్రెటేరియట్‌లో మంత్రిని ప్రత్యేకంగా కలిసింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, లైఫ్ సైన్సెస్, ఏఐ ఆధారిత హెల్త్ కేర్, క్లీన్ ఎనర్జీ, ఎడ్యుకేషన్, స్కిల్స్ తదితర రంగాల్లో యూటా-తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడికి గల అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాక, గ్లోబల్ ఎకానమీకి సపోర్ట్ ఇచ్చేలా, లాంగ్-టర్మ్ వాల్యూ క్రియేషన్‌కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తీసుకొచ్చిన సంస్కరణలు, పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఏయే రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం, పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతలు, పారిశ్రామికవేత్తలకిచ్చే ప్రోత్సాహకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం టీ-హబ్, టీ-వర్క్స్, వీ హబ్‌లను వరల్డ్ ట్రేడ్ సెంటర్-యూటా, సిలికాన్ స్లోప్స్ అండ్ యూటా టెక్ స్టార్టప్‌లతో అనుసంధానించేలా చొరవ చూపాలని ప్రతినిధి బృందాన్ని కోరారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో యూనివర్సిటీ ఆఫ్ యూటా, బీవైయూ, న్యూమాంట్ యూనివర్సిటీలతో కలిసి రాష్ట్రంలోని ప్రముఖ విద్యా సంస్థలు ఉమ్మడి అకడమిక్, రీసెర్చ్ ప్రోగ్రామ్ లను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ద్వైపాక్షిక సహకారం పెట్టుబడులకే పరిమితం కాకుండా ఇన్నోవేషన్, స్కిల్స్, టెక్నాలజీ రంగాల్లో ఉమ్మడి ఆవిష్కరణలకు దిక్సూచిగా మారాలని మంత్రి ఆకాంక్షించారు. తెలంగాణలాంటి ఫాస్ట్ గ్రోయింగ్, డైనమిక్, ప్రోయాక్టివ్ రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు 'యూటా' సిద్ధంగా ఉందని డేవిడ్ కార్లెబాగ్ చెప్పారు. రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడి విషయంలో తెలంగాణతో కలిసి చురుగ్గా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో యూటా హౌజ్ ఆఫ్ రిప్రజంటేటివ్స్ జేసన్ థాంప్సన్, మాట్ మాక్‌ఫెర్సన్, నికోల్ మాక్‌ఫెర్సన్, లైఫ్ టైం ప్రెసిడెంట్ బీజే హాకే, జేకేడీ ప్రెసిడెంట్ మైక్ నెల్సన్, మోనెరె ఏఐ సీఈవో, కో-ఫౌండర్ మౌనంది, భారత్ వ్యాలీ అడ్వైజర్లు స్టీవ్ వుడ్, సున్‌హాష్ లోడే, ఎక్విప్ సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ ఫౌండర్ లక్ష్మీనారాయణ, ఐఆర్ఎఫ్ గురు సౌలే తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయ్

**ఎంపీ ఆర్ కృష్ణయ్య మండిపాటు**



హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం నిల్వలేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అన్నారు. రాష్ట్రంలో ఐదు రోజులుగా కాలేజీలు మూసివేసి నిరసనలు తెలుపుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేకపోవడం విడ్డూరంగా ఉ ఒదన్నారు. పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు నీల వెంకటేష్ , మోడీ రాందేవ్ ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్ లోని ఉన్నత విద్యా మండలి ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడారు...తెలంగాణ రాష్ట్రంలో గత 5 రోజులుగా కాలేజీలను నిరవదికంగా బంద్ చేసి నిరసన తెలుపుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 24 నెలలు గడుస్తున్నా విద్యార్థుల ఫీజుబకాయలను విడుదల చేయకపోవడం ఏమిటన్నారు. కాలేజీ యాజమాన్యాలు కష్టాలు కూడా చెప్పతరంగా లేవన్నారు. కాలేజీ లెక్చరర్ల జీతాలు నెలల తరబడి ఇవ్వక ఇబ్బందులు పడుతున్నారనీ, లెక్చరర్లకు జీతాలు లేక కుటుంబాలు పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారనీ తెలిపారు. ముట్టడి కార్యక్రమంలో మోడీ రాందేవ్, గవ్వల భరత్ కుమార్, అనంతయ్య, రాజేందర్, అజయ కుమార్, శివ యాదవ్, నరేష్ గౌడ్, లింబాద్రి, నిఖిల్, రాజ్ కుమార్, రఘుపతి, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రేవంత్ సీఎం కాకముందే ఆర్ఆర్ఆర్ మంజూరు

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి క్లారిటీ**

హైదరాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిస్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ బ్యాడ్ ఫ్యామిలీస్ అని అన్నారు. ఈ రెండు ఫ్యామిలీస్ తెలంగాణకు పట్టిన శని అని విమర్శించారు. తాను మెట్రో విస్తరణను అడ్డుకుంటున్నానని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు.. ఎక్కడ అడ్డుకున్నానో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్ అండ్ టీతో రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఒప్పందమే చేసుకోలేదని అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా డీపీఆర్ సిద్ధం చేయలేదని విమర్శించారు. మరోవైపు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాకముందే ఆర్ఆర్ఆర్ మంజూరు అయిందని అన్నారు. తానే స్వయంగా ప్రధాని మోడీని కలిసి ట్రిపులార్‌ను మంజూరు చేయించానని కిషన్ రెడ్డి చెప్పారు. వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులను అడ్డుకున్నానని మాట్లాడుతున్నారు.. ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తికి తగదు అని అన్నారు. హైడ్రా నిజంగానే న్యాయం వైపు ఉంటే.. ఆక్రమణలనే కూల్చివేస్తే.. ఇప్పటివరకు ఎంఐఎం కాలేజీలను ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని చెప్పారు. మూసీ బాధితులకు న్యాయం చేయాలనుకుంటున్నామని అన్నారు.

## ఎయిరిండియా పైలట్‌ను నిందించలేం

**అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై సుప్రీం కోర్టు**

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో 260 మంది ప్రాణాలను బలిగొన్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనలో పైలట్-ఇన్-కమాండ్‌ను నిందించలేమని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటనకు సంబంధించి పైలట్ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం, కేంద్ర ప్రభుత్వం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)లకు నోటీసులు జారీ చేసింది. ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానానికి పైలట్-ఇన్-కమాండ్‌గా పనిచేసిన సుమీత్ సబర్వాల్ ఈ ప్రమాదంలో మరణించారు. ఆయన తండ్రి పుష్కరాజ్ సబర్వాల్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్ఐపీ) ఈ ఘటనపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) ఈ ఏడాది జులైలో విడుదల చేసిన ప్రాథమిక నివేదికను వారు తమ పిటిషన్‌లో సవాల్ చేశారు. విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోయిందని ఏఏఐబీ తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. రెండు ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌లు ఒకదాని తర్వాత ఒకటి వేగంగా "కటాఫ్" పొజిషన్‌లోకి వెళ్లాయని తెలిపింది. సుమారు 10 సెకన్ల తర్వాత స్విచ్‌లను తిరిగి ఆన్ చేసినప్పటికీ, అప్పటికే ఇంజిన్లు ఆగిపోయి (ఫ్లేమ్డ్ అవుట్) విమానం కుప్పకూలిందని పైలట్ల సంఘం దాఖలు చేసిన పిటిషన్లను స్వీకరించిన సుప్రీంకోర్టు, పైలట్‌ను నిందించలేమని వ్యాఖ్యానిస్తూ కేంద్రం, డీజీసీఏల నుంచి వివరణ కోరింది.

# మెగా సిటీలుగా విశాఖ, అమరావతి, తిరుపతి

**మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి: ఏపీ సీఎం చంద్రబాబు.. 26 పరిశ్రమలకు రాష్ట్ర పెట్టుబడుల బోర్డు ఆమోదం.. 14, 15 తేదీల్లో విశాఖలో సదస్సు నిర్వహణకు సన్నాహాలు**



అమరావతి, నవంబర్ 7 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగిన 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం, రూ. 1,01,899 కోట్ల విలువైన 26 పారిశ్రామిక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. ఈ భారీ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 85,570 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. "రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చేలా చూడటం అధికారుల బాధ్యత. పెట్టుబడిదారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని సమయం వృధా కాకుండా తక్షణం ఆమోదం తెలియచేయాలి. ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన పరిశ్రమలు, ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చేలా (గ్రౌండ్ అయ్యేలా) చూసే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. పెట్టుబడులు పెట్టే పరిశ్రమల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలి" అని ఆయన ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో భూములు కేటాయించినా ఇప్పటికీ ప్రారంభం కాని ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించాలని, నిర్మాణంలో పురోగతి లేకపోతే వాటి అనుమతులు రద్దు చేయాలని సీఎం తేల్చిచెప్పారు. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, చిప్, సెమీ కండక్టర్లు, డ్రోన్ల తయారీ వంటి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ పార్క్ ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో 15 పారిశ్రామిక జోన్లు ఏర్పాటు చేసి, క్లస్టర్ల వారీ విధానంతో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించి, పెట్టుబడులు చేజారకుండా చూడాలన్నారు. "కేంద్రం ఇచ్చే ప్రోత్సాహకాలు ఆలస్యమైనా, రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ఇవ్వాల్సినవి వెంటనే అందించి పరిశ్రమలను నిలబెట్టాలి" అని సీఎం స్పష్టం చేశారు. పారిశ్రామిక అవసరాల కోసం ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధంగా ఉంచాలని, ప్రైవేటు భూ యజమానులు పరిశ్రమలకు భూములిచ్చేందుకు ముందుకొస్తే వారిని ప్రోత్సహించాలని తెలిపారు.

### మూడు మెగా సిటీలు... మాస్టర్ ప్లాన్లు

ఏపీలో మూడు మెగా సిటీలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యాన్ని సీఎం పునరుద్ఘాటించారు. "అనకాపల్లి నుంచి విజయనగరం వరకు విశాఖను, అలాగే అమరావతి, తిరుపతి నగరాలను మెగా సిటీలుగా అభివృద్ధి చేయాలి. అమరావతికి ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఉంది. విశాఖ, తిరుపతిలకు కూడా వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. ఈ నగరాలను టూరిజం, ఐటీ సహా వివిధ పరిశ్రమలకు కేంద్రాలుగా తీర్చిదిద్దాలి" అని సీఎం అన్నారు. మున్సిపల్, పరిశ్రమలు, ఐటీ, పర్యాటక శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ నగరాలను నివాసయోగ్యంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న పెట్టుబడుల సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఎస్ఐపీబీ ఆమోదించిన పరిశ్రమలకు వెంటనే శంకుస్థాపనలు చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహా ఇతర మంత్రులు వివిధ జిల్లాల్లో ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటామని తెలిపారు. తాను ఇటీవల జరిపిన విదేశీ పర్యటనల్లో పలువురు పారిశ్రామికవేత్తలను సదస్సుకు ఆహ్వానించానని, వారు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు, సదస్సుకు హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారని వివరించారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు



సీఎంకు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, టీజీ భరత్, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### లక్ష కోట్ల ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం

ఆంధ్రప్రదేశ్‌కు పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగిన 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం, రూ.1,01,899 కోట్ల విలువైన 26 పారిశ్రామిక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. ఈ భారీ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 85,570 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత 16 నెలల కాలంలో జరిగిన 12 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా రాష్ట్రానికి మొత్తంగా రూ. 8,08,899 కోట్ల పెట్టుబడులు, 7,05,870 ఉద్యోగాలు రానున్నాయని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.

## భారత్‌లో ఎస్‌యూ-57 స్టెల్త్ జెట్ల తయారీ

**పూర్తి టెక్నాలజీ బదిలీకి రష్యా గ్రీన్ సిగ్నల్!**

న్యూఢిల్లీ: భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని చేరుకోబోతోంది. రష్యాకు చెందిన అత్యాధునిక ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ ఎస్‌యూ-57 (సుఖోయ్-57)ను భారీ ఎత్తున ఉత్పత్తి చేసే సామర్థ్యం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు ఉందని రష్యా టెక్నికల్ బృందం నిర్ధారించింది. కేవలం ఉత్పత్తికి అనుమతి ఇవ్వడమే కాకుండా, సోర్స్ కోడ్‌లు సహా పూర్తి టెక్నాలజీని బదిలీ చేయడానికి కూడా రష్యా ముందుకొచ్చింది. ఈ ఒప్పందం ఖరారైతే, ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాల్లో ఒకటైన ఎస్‌యూ-57 ఇకపై భారత్‌లోనే తయారు కానుంది. సుఖోయ్ డిజైన్ బ్యూరో, ఇతర రక్షణ సంస్థలతో కూడిన రష్యా బృందం సెప్టెంబర్ నెలలో హెచ్ఏఎల్ సౌకర్యాలను సందర్శించింది. ఎస్‌యూ-57ఈ యుద్ధ విమానాల దేశీయ ఉత్పత్తికి అవసరమైన మౌలిక సదుపాయాల్లో దాదాపు 50 శాతం ఇప్పటికే హెచ్ఏఎల్ వద్ద ఉన్నాయని ఈ బృందం తన నివేదికలో స్పష్టం చేసింది. హెచ్ఏఎల్ సుమారు 505 స్టెల్త్ జెట్లను తయారుచేయగలదని నివేదికలో పేర్కొన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఢిల్లీ పర్యటనకు కొద్ది రోజుల ముందు ఈ నివేదికను సమర్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పుతిన్ పర్యటనలోనే ఈ కీలక ఒప్పందంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు. గతంలో సుఖోయ్ ఎస్‌యూ-30ఎంకెఐ ఫైటర్ జెట్లను భారత్‌లో విజయవంతంగా ఉత్పత్తి చేసిన అనుభవం హెచ్ఏఎల్‌కు ఉంది. 2000 సంవత్సరంలో కుదిరిన ఒప్పందం మేరకు ఈ జెట్లను హెచ్ఏఎల్ తయారు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే రష్యా బృందం బెంగళూరు, నాసిక్, కోరాపుట్‌లోని హెచ్ఏఎల్ యూనిట్లను సందర్శించి, ఇక్కడి తయారీ సామర్థ్యాలను, సాంకేతిక సంసిద్ధతను అంచనా వేసింది. రష్యా నివేదిక నేపథ్యంలో, పెట్టుబడులు పెట్టాల్సిన కీలక రంగాలను గుర్తిస్తూ హెచ్ఏఎల్ కూడా ఒక అంతర్గత నివేదికను సిద్ధం చేస్తోంది. అత్యాధునిక కాంపోజిట్ మెటీరియల్స్, రాడార్‌ను తప్పించుకునే కోటింగ్స్, డిజిటల్ డిజైన్, నెక్స్ట్ జనరేషన్ ఇంజిన్ టెస్ట్ బెడ్స్ వంటి వాటిపై దృష్టి సారించనుంది.

# 12న వైసీపీ నిరసన ర్యాలీలు

**మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు**

**నిర్ణయం వెనక్కి తీసుకునేదాకా ఉద్యమం**

**మాజీమంత్రి అంబటి రాంబాబు**



తాడేపల్లి, నవంబర్ 7 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీన రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో భారీ నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. 'కోటి సంతకాల' సేకరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టి, ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో నిరసన ర్యాలీలకు సంబంధించిన పోస్టర్‌ను పార్టీ నేతలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, టీజేఆర్ సుధాకర్ బాబు, దొంతిరెడ్డి వేమారెడ్డి, మనోహర్ రెడ్డి, వంగవీటి నరేంద్ర, చంద్రశేఖర్ రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. "మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలనే నిర్ణయం చాలా దురదృష్టకరం. మాజీ సీఎం జగన్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన మెడికల్ కాలేజీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష కట్టడం సరికాదు" అని అన్నారు. ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థులకు వ్యతిరేకంగా ఉందని ఆయన ఆరోపించారు. "ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు మా ఉద్యమం కొనసాగుతుంది. ఇందులో భాగంగానే కోటి సంతకాల సేకరణ చేపడుతున్నాం. ఈ నెల 12న అన్ని నియోజకవర్గాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించి కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపిస్తాం" అని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

# డిసెంబర్ 30 నుంచి వైకుంఠ ద్వార దర్శనం



తిరుమల, నవంబర్ 7 (ఈవార్తలు): శ్రీవారి భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే వైకుంఠ ద్వార దర్శనం తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్ 30వ తేదీ నుంచి 2026 జనవరి 8వ తేదీ వరకు పది రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనున్నట్లు టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. దర్శనానికి సంబంధించిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టోకెన్ల జారీ విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అంగ ప్రదక్షిణ టోకెన్ల జారీ విధానంలోనూ కీలక మార్పు చేసినట్లు ఈవో ప్రకటించారు. ఇప్పటివరకు అమలులో ఉన్న డిప్ విధానాన్ని రద్దు చేసి, 'ముందు వచ్చిన వారికి ముందు' ప్రాతిపదికన టోకెన్లు కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కొత్త విధానం వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ఆన్‌లైన్ ద్వారా అమల్లోకి వస్తుందని ఆయన వివరించారు. భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు శ్రీవాణి, ఇతర దర్శన టోకెన్ల జారీ విధానాన్ని సమీక్షించేందుకు టీటీడీ బోర్డు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. ఈ కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలను నవంబర్ 17 నుంచి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో ప్రకటించారు. మరోవైపు, శ్రీవాణి ట్రస్టుకు అందిన రూ.750 కోట్ల నిధులతో రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో 5 వేల భజన మందిరాలను నిర్మించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, అమరావతి రాజధాని పరిధిలోని వెంకటపాలెంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రాకారం, కల్యాణ మండపం, రాజగోపురం వంటి అభివృద్ధి పనులను ఈ నెల 27న ప్రారంభించనున్నట్లు తెలిపారు. తిరుమల అటవీ ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని కాపాడి, పచ్చదనాన్ని పెంచేందుకు పదేళ్ల ప్రణాళికను బోర్డు సిద్ధం చేసిందని పేర్కొన్నారు. టీటీడీ పరిధిలోని అన్ని ఆలయాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాదాలు అందేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఈవో అనిల్ కుమార్ సింఘాల్ వివరించారు.





# అమరావతికి మైక్రోసాఫ్ట్

**రూ.1,772 కోట్ల భారీ పెట్టుబడితో క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రం**

అమరావతి, నవంబర్ 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీ రంగం కొత్త శిఖరాలకు చేరనుంది. ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు శ్రీకారం చుట్టింది. ఏకంగా రూ.1,772.08 కోట్ల విలువైన పెట్టుబడితో అమరావతిలో అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించింది. ఈ పరిణామం అమరావతిని దేశంలోనే తొలి క్వాంటమ్ వ్యాలీగా నిలపాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఊతమిచ్చినట్లయింది. ఈ ప్రతిపాదనలో భాగంగా, అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 1,200 క్యూబిట్ సామర్థ్యంతో (50 లాజికల్ క్యూబిట్స్) ఓ భారీ క్వాంటమ్ కంప్యూటర్‌ను మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం క్వాంటమ్ వ్యాలీ భవనానికి ఆనుకుని ఉన్న 4 వేల చదరపు అడుగుల ప్రత్యేక భవనాన్ని వినియోగించనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ఇప్పటికే 50 ఎకరాల భూమిని కేటాయించింది. మైక్రోసాఫ్ట్ రాకతో అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు మరింత వేగం పుంజుకోనుంది. ఇప్పటికే మరో టెక్ దిగ్గజం ఐబీఎం 133 క్యూబిట్ సామర్థ్యంతో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఐబీఎం సంస్థ టీసీఎస్, ఎల్%డ%టీలతో కలిసి దేశంలోనే మొట్టమొదటి ఫుల్ స్టాక్ క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్ ఏర్పాటుకు సహకారం అందిస్తోంది. మరోవైపు, జపాన్‌కు చెందిన ఫుజిట్సు కూడా 64 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌తో పాటు, ఒక ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 'అమరావతి క్వాంటం వ్యాలీ డిక్లరేషన్'ను రూపొందించింది. దీని ద్వారా 2029 జనవరి 1 నాటికి ఈ రంగంలో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. సిలికాన్ వ్యాలీ తరహాలో అత్యాధునిక ఆవిష్కరణల కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వ ప్రకటన ప్రకారం, క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్ 2026 జనవరి 1 నాటికి కార్యకలాపాలు ప్రారంభించనుంది. భవిష్యత్తులో ఇక్కడ పరిశోధనల కోసం దశలవారీగా 90 లక్షల చదరపు అడుగుల మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. క్వాంటమ్ టెక్నాలజీ ప్రాముఖ్యతను గుర్తిస్తూ ఐక్యరాజ్యసమితి 2025ను 'అంతర్జాతీయ క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంవత్సరం'గా ప్రకటించింది. రాబోయే రోజుల్లో ప్రపంచ గతిని మార్చే గేమ్-ఛేంజింగ్ టెక్నాలజీగా క్వాంటమ్ కంప్యూటింగ్ నిలుస్తుందని, 2030 నాటికి ఇది అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పరకామణి దోషులకు జైలు తప్పదు

**కరుణాకర్ రెడ్డిపై భానుప్రకాశ్ రెడ్డి ఫైర్**



తిరుమల, నవంబర్ 7 (ఈవార్తలు): టీటీడీ పరకామణి కేసులో దోషులు కచ్చితంగా జైలుకు వెళతారని, శ్రీవారి ఖజానాను దోచుకున్న మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, ఆయన బృందాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. దొంగను దాతగా, దొంగతనాన్ని కానుకగా మార్చిన వారు ఇప్పుడు నీతిమంతుల్లా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భానుప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పరకామణిలో జరిగిన అక్రమాలపై కరుణాకర్ రెడ్డి అండ్ కో సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని భానుప్రకాశ్ రెడ్డి ధ్వజమెత్తారు. "పరకామణి విషయంలో దొంగలను వెంటబెట్టుకుని లోకాయుక్తకు వెళ్లి కరుణాకర్ రెడ్డి ఎలా రాజీ చేస్తారు? ఆనాడు దీనికి సంబంధించిన తీర్మానాలపై సంతకాలు చేసింది మీరు కాదా?" అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ వ్యవహారంపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. "శ్రీనివాసుడు ఇప్పుడు ఉగ్ర నరసింహుడిగా మారారు. తన ఖజానాకు కన్నం వేసిన కరుణాకర్ రెడ్డి బృందాన్ని శ్రీవారు కచ్చితంగా శిక్షిస్తారు. వడ్డీకాసుల వాడు.. వడ్డీతో సహా వారి నుంచి వసూలు చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయి" అని భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. పరకామణి అనేది అత్యంత సున్నితమైన అంశమని, కరుణాకర్ రెడ్డి చెబుతున్న అబద్ధాలను భక్తులు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.



## విశాఖ స్టేడియంలోని ఒక వింగ్‌కు శ్రీచరణి పేరు

వైజాగ్, నవంబర్ 7 (ఈవార్తలు): వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్ సభ్యురాలైన ఆంధ్రప్రదేశ్ మహిళా క్రికెటర్ శ్రీ చరణికి అరుదైన గౌరవం దక్కింది. విశాఖపట్నంలోని క్రికెట్ స్టేడియంలో ఒక వింగ్‌కు ఆమె పేరు పెట్టనున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రకటించింది. ఈ నిర్ణయం క్రీడా వర్గాల్లో హర్షం నింపుతోంది. మంగళగిరిలోని క్రికెట్ స్టేడియంలో జరిగిన మీడియా సమావేశంలో ఏసీఏ అధ్యక్షుడు, టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. అంతకుముందు, శ్రీ చరణి ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆమె ప్రతిభను అభినందించిన సీఎం, రాష్ట్ర ప్రభుత్వం తరపున భారీ ప్రోత్సాహకాలను ప్రకటించారు. శ్రీ చరణికి గ్రూప్ 1 స్థాయి ఉద్యోగం, రూ. 2.5 కోట్ల నగదు బహుమతి, కడపలో నివాస స్థలం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ తర్వాత మంగళగిరిలో కేశినేని చిన్ని మాట్లాడుతూ, ఏసీఏ తరపున రాష్ట్రంలోని క్రీడాకారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. శ్రీ చరణికి లభించిన ఈ గౌరవం భవిష్యత్ తరాల క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, రాష్ట్రంలో మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో త్వరలోనే ఒక మహిళా క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు.

## వ్యోమగామి శిక్షణకు నిడదవోలు యువతి

నిడదవోలు, నవంబర్ 7 (ఈవార్తలు): ఏపీకి చెందిన ఓ యువతి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. అంతరిక్షంలోకి అడుగుపెట్టే తన కలను సాకారం చేసుకునే దిశగా కీలక మైలురాయిని దాటింది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన కుంచల కైవల్య రెడ్డి, అమెరికాలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక వ్యోమగామి శిక్షణకు ఎంపికైంది. ఫ్లోరిడాలోని 'టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్' ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణ కోసం ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల నుంచి వేలాది మంది పోటీ పడగా, కేవలం 150 మంది మాత్రమే అర్హత సాధించారు. వారిలో కైవల్య రెడ్డి ఒకరిగా నిలవడం విశేషం. ఈ శిక్షణ నాలుగేళ్ల పాటు కొనసాగనుంది. దీనిని విజయవంతంగా పూర్తి చేసిన వారు 2029లో అంతరిక్ష యాత్రకు వెళ్లనున్నారు. ఈ యాత్రలో భాగంగా వ్యోమగాములు భూమి నుంచి 300 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో పరిభ్రమించనున్నారు. మొత్తం 5 గంటల పాటు సాగే ఈ మిషన్‌లో సుమారు 3 గంటల పాటు జీరో గ్రావిటీలో గడుపుతారు. కైవల్యకు నాసా మాజీ వ్యోమగామి, 224 రోజులు అంతరిక్షంలో గడిపిన విలియం మెక్‌ఆర్థర్, బ్రెజిల్ తొలి వ్యోమగామి మార్కోస్ పోంటెస్ వంటి ప్రముఖ నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. కైవల్య రెడ్డి తండ్రి కుంచాల శ్రీనివాసరెడ్డి, నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆమె తల్లి విజయలక్ష్మి గృహిణి. తనకు చిన్నప్పటి నుంచే అంతరిక్షం, ఖగోళ శాస్త్రంపై ఆసక్తి ఉండేదని కైవల్య తెలిపింది. భవిష్యత్తులో జర్మనీలో ఆస్ట్రోఫిజిక్స్ చదివి ఖగోళ శాస్త్రవేత్త కావాలన్నదే తన లక్ష్యమని పేర్కొంది. 17 ఏళ్లకే ఈ ఘనత సాధించిన కైవల్య, గతంలోనూ తన ప్రతిభను చాటుకుంది. 2023లో నాసా ఆధ్వర్యంలో జరిగిన 'అంతర్జాతీయ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం' (%ఞూూా%)కు కూడా ఎంపికైంది. ఆ కార్యక్రమంలో భాగంగా ఆమె అమెరికాలోని అలబామాలో 15 రోజుల పాటు శిక్షణ పొందింది. సైన్స్ పట్ల ఆమెకున్న ఆసక్తి, పట్టుదలే ఈ అరుదైన అవకాశాలను అందిస్తున్నాయని పలువురు అభినందిస్తున్నారు.



# మోదీ రమ్మన్నారు.. వెళ్తున్నా!


## త్వరలో భారత్ వస్తానన్న ట్రంప్

వాషింగ్టన్: ఎడా పెడా టారిఫ్ లతో భారత్ పై పెనుభారం మోపిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇప్పుడు భారత్ పర్యటనకు సిద్ధమవుతున్నారు. వచ్చే ఏడాది ఆయన పర్యటన ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ విషయంపై స్వయంగా హింట్ ఇచ్చిన ట్రంప్.. ప్రధాని మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్–అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాని మోడీతో వాణిజ్య చర్చలు చాలా బాగా జరుగుతున్నాయని తెలిపారు. 'మోదీ.. రష్యా నుంచి చమురు కొనడం చాలావరకు మానేశారు. ఆయన నాకు గొప్ప స్నేహితుడు. మా మధ్య చర్చలు జరుగుతున్నాయి. నేను అక్కడికి రావాలని ఆయన కోరుకుంటున్నారు. మేము దాన్ని పరిశీలిస్తున్నాం. నేను వెళ్తాను. ప్రధాని మోడీ గొప్ప వ్యక్తి' అని ట్రంప్ అన్నారు. ఈ క్రమంలోనే వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించాలని మీరు ప్లాన్ చేస్తున్నారా? అని ఓ విలేకరి ట్రంప్‌ను ప్రశ్నించారు. దీనికి ఆయన బదులిస్తూ.. 'అలా కావొచ్చు. అవును' అని పేర్కొన్నారు.

# శబరిమలలో రసాయన కుంకుమపై నిషేధం

### కేరళ హైకోర్టు కీలక ఆదేశాలు

శబరిమల: శబరిమల యాత్ర ప్రారంభానికి ముందు కేరళ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని శబరిమలలో రసాయనాలతో కూడిన కుంకుమ అమ్మకాలను తక్షణమే నిషేధించాలని ట్రావెన్‌కోర్ దేవస్వంబోర్డు (టీడీబీ)ను ఆదేశించింది. నవంబర్ 17 నుంచి వార్షిక



మండల–మకరవిళక్కు యాత్ర సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. జస్టిస్ రాజా విజయరాఘవన్, జస్టిస్ కె.వి. జయకుమార్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. 2025–26 యాత్ర సీజన్‌లో యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి కేంద్రాల ('ఎడతావలంలు') వద్ద సౌకర్యాలపై స్పెషల్ కమిషనర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా సుమోటోగా స్వీకరించిన పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టింది. యాత్రికుల కోసం పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆహారం, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని అక్టోబర్ 16న ఇచ్చిన ఆదేశాలను ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తుచేసింది. ఎరుమేలి సమీపంలోని ప్రవాహాల వద్ద యాత్రికులు ప్లాస్టిక్ షాంపూ ప్యాకెట్లను పడేస్తుండటం వల్ల కాలుష్యం పెరుగుతోందని గతంలోనే కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆ ప్రాంతంలో ప్లాస్టిక్ ప్యాకెట్లపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని కొట్టాయం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. శుక్రవారం నాటి విచారణలో ఎరుమేలి గ్రామ పంచాయతీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వలియతోడు వాగులో షాంపూ ప్యాకెట్లు, ఇతర వ్యర్థాలను ఇప్పటికీ పడేస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా 'పేటతుళ్లల్' ఘట్టంలో భక్తులు వాడే రసాయన కుంకుమ కూడా కాలుష్యానికి ఒక ప్రధాన కారణంగా మారుతోందని తెలిపారు. ఆ తర్వాత దానిని శుభ్రం చేసుకోవడానికి భక్తులు డిటర్జెంట్లు, షాంపూలు వాడటంతో నీరు కలుషితమవుతోందని వివరించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, పంబ మరియు సన్నిధానం వద్ద షాంపూ ప్యాకెట్లు, రసాయన కుంకుమ అమ్మకాలపై కఠిన నిషేధం విధించాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా, వ్యర్థాలు నీటిలో పేరుకుపోకుండా వాగులకు వలలు లేదా చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని టీడీబీకి సూచించింది. కొచ్చిన్, గురువాయూర్ దేవస్వంబోర్డులు, చెంగన్నూర్ మున్సిపాలిటీ కూడా కోర్టు ఆదేశాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపాయి. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం, తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# ఇండిగో విమానంలో కాలిన వాసన

### భయంతో వణికిపోయిన ప్రయాణికులు




న్యూఢిల్లీ: ఇండిగో విమానంలో ప్రయాణికులకు ఓ భయానక అనుభవం ఎదురైంది. విమానం గాల్లో ఉండగా క్యాబిన్‌లో ఒక్కసారిగా తీవ్రమైన మంటల వాసన రావడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో తెలియక కొందరు భయంతో విలపించారు. ఈ ఘటనను ఓ ప్రయాణికుడు వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రయాణికుడు పోస్ట్ చేసిన వీడియో ప్రకారం, విమానం గాల్లో ఉండగా ఏదో కాలిపోతున్నట్లుగా ఘాటైన వాసన వచ్చింది. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. విమాన సిబ్బంది కూడా కంగారు పడుతూ వాసన ఎక్కడి నుంచి వస్తుందోనని ఓవర్‌హెడ్ బిన్‌లను తనిఖీ చేయడం వీడియోలో కనిపించింది. "విమానాన్ని కిందకు దించేయండి" అని ఒకరు అరుస్తున్నట్లు కూడా ఉంది. ప్రయాణికులు వాసన గురించి అడగ్గా, ఇది కొత్త విమానమని, కేవలం రెండు ట్రిప్పులు మాత్రమే పూర్తి చేసిందని సిబ్బంది చెప్పినట్లు ఆ ప్రయాణికుడు వివరించాడు. "సిబ్బంది ప్రయాణికులను శాంతపరచడంలో బాగానే పనిచేశారు. కానీ, వాసనకు సరైన సాంకేతిక కారణం చెప్పలేకపోయారు. వాసన చాలా ఎక్కువఉంది, అది క్రమంగా పెరుగుతూనే ఉంది" అని అతను తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. చివరికి విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. అయితే, అసలు ఏం జరిగిందో, ఆ వాసనకు కారణం ఏంటో ప్రయాణికులకు ఎవరూ స్పష్టంగా చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో విమానయాన సంస్థల భద్రతా ప్రమాణాలపై నెటిజన్లు చర్చ మొదలుపెట్టారు. "కొత్త విమానం కాబట్టి కొన్ని భాగాల పూతలు వేడికి కరిగి వాసన వచ్చి ఉండొచ్చు" అని ఒకరు కామెంట్ చేయగా, "ఇంజిన్ నుంచి పొగ వచ్చి ఉండవచ్చు" అని మరొకరు అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో మరో నెటిజన్, ఇండిగో సర్వీసుల నాణ్యత తగ్గిపోతోందని తన అనుభవాన్ని పంచుకున్నారు. మొత్తానికి ఈ ఘటన ప్రయాణికుల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించింది.

## భారత్ ఫోన్ కాల్ వల్లే

# ప్రాణాలతో షేక్ హసీనా!

### 'ఇన్షా అల్లా బంగ్లాదేశ్: ది స్టోరీ ఆఫ్ ఆన్ అన్‌ఫినిష్డ్ రెవెల్యూషన్' పుస్తకంలో కీలక విషయాలు

ఢాకా/న్యూఢిల్లీ: గత ఏడాది బంగ్లాదేశ్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అల్లర్లు జరగడంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అక్కడి నుంచి తప్పించుకుని భారత్‌కు వచ్చారు. అప్పటి నుంచి ఆమె ఇక్కడే సురక్షితంగా ఉంటున్నారు. ముష్కరుల దాడి నుంచి కేవలం 20 నిమిషాల వ్యవధిలో ఆమె తప్పించుకుని సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారు. ఆమె అక్కడి నుంచి తప్పించుకోవడానికి భారత్ నుంచి వచ్చిన ఫోన్ కాల్ కారణమని తెలుస్తోంది. ఆమె ప్రాణాలను కాపాడింది భారత్ నుంచి వచ్చిన ఫోన్ కాలేనని తెలియజేస్తూ ఒక పుస్తకం త్వరలో విడుదల కానుంది. 'ఇన్షా అల్లా బంగ్లాదేశ్: ది స్టోరీ ఆఫ్ ఆన్ అన్‌ఫినిష్డ్ రెవెల్యూషన్' అనే పేరుతో రానున్న ఈ పుస్తకంలో పలు ఆసక్తికర విషయాలను పొందుపరిచారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఆ నిరసనల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. పరిస్థితులు తీవ్ర హింసాత్మకంగా మారడంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి, దేశం విడిచి భారత్‌కు వచ్చారు. ఆమె అధికారిక భవనం గణభవన్ నుండి బయటకు వచ్చిన సరిగ్గా 20 నిమిషాలకు నిరసనకారులు అక్కడకు చొచ్చుకువచ్చారు. వారు రావడానికి ముందే ఆమె సురక్షితంగా బయటపడ్డారు. పరిస్థితులు అదుపు తప్పుతున్నప్పటికీ, తాను బంగ్లాదేశ్‌ను విడిచి వెళ్లబోనని షేక్ హసీనా



కరాఖండీగా చెప్పినట్లు ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ఆమెను బంగ్లాదేశ్ విడిచి వెళ్లేందుకు ఒప్పించాలని సోదరి రెహానా, అమెరికాలో ఉంటున్న ఆమె కుమారుడు వాజీద్‌కు బంగ్లా ఆర్మీ చీఫ్, ఎయిర్ ఫోర్స్, నేవీ చీఫ్‌లు సూచించినట్లు సమాచారం. నిరసనకారులు గణభవన్ వైపుకు దూసుకొస్తున్న సమయంలో హసినా ప్రయాణించే విమానానికి తమ గగనతలంలోకి ప్రవేశించేందుకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆ పుస్తకంలో పేర్కొన్న వివరాల ప్రకారం, 2024 ఆగస్టు 4న మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు భారత్ నుంచి ఫోన్ కాల్ వచ్చిందని, ఆ ఫోన్ చేసింది హసీనాతో బాగా పరిచయమున్న ఒక ఉన్నతాధికారి అని తెలుస్తోంది. ఆ సంభాషణ చాలా క్లుప్తంగా ముగిసింది. ఇప్పటికే చాలా ఆలస్యమైందని, వెంటనే గణభవన్‌ను వీడకపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆ అధికారి హసీనాను అప్రమత్తం చేశారని, భవిష్యత్తులో పోరాటం చేయడానికి ప్రాణాలతో ఉండటం ముఖ్యమని సూచించారని ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ఆ మాటలకు షాక్ తిన్న హసీనా, బంగ్లాదేశ్‌ను వీడాలని నిర్ణయం తీసుకోవడానికి ఆ తర్వాత కూడా అరగంట సమయం తీసుకున్నారని ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ఆ సందేశాన్ని పూర్తిగా విశ్వసించిన ఆమె, దేశం విడిచి వెళ్ళే ముందు తన ప్రసంగాన్ని రికార్డు చేయాలని భావించారని వెల్లడించారు. అయితే, ముష్కరులు ఏ క్షణమైనా లోపలకి చొచ్చుకు వచ్చే అవకాశం ఉండటంతో సైన్యాధికారులు ప్రసంగం రికార్డు చేయడానికి అంగీకరించలేదు. అనంతరం సోదరి రెహానా... హసీనాను బలవంతంగా కారులో కూర్చోబెట్టారు. మధ్యాహ్నం 2.33 గంటల సమయంలో చాపర్ బంగ్లాదేశ్‌లో టేకాఫ్ అయి అరగంటలో భారత్‌లో దిగిందని, అప్పటి నుంచి ఢిల్లీలో ఆమెకు భారత ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని ఆ పుస్తకం పేర్కొంది. ఆ రోజు భారత్ నుంచి ఫోన్ కాల్ రాకపోతే తన తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్‌లాగే హసీనా కూడా హత్యకు గురయ్యేవారని ఆ పుస్తకంలో ఆందోళన వ్యక్తం చేశారు.

# ఏమో మరి.. మాకైతే తెల్వదు

### ట్రంప్ భారత పర్యటనపై విదేశాంగశాఖ

న్యూఢిల్లీ: ట్రంప్ భారత పర్యటనపై విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడుతూ.. 'ట్రంప్ భారత పర్యటనపై తాను ఏమీ స్పందించలేనని.. ఎందుకంటే చెప్పేందుకు తన వద్ద ఏమీ లేదన్నారు. భారత్‌లో ట్రంప్ పర్యటనపై మావద్ద సమాచారం ఏదీ లేదన్నారు. జపాన్, ఆస్ట్రేలియా, యునైటెడ్ స్టేట్స్, భారత్‌తో కూడిన వ్యూహాత్మక సంస్థ అయిన క్వాడ్ గురించి అడిగిన ప్రశ్నకు రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ.. క్వాడ్ భాగస్వామ్య దేశాలు ఇండో–పసిఫిక్ ప్రాంతానికి సంబంధించిన క్లిష్టమైన అంశాలపై చర్చించేందుకు ఒక ముఖ్యమైన వేదికగా భావిస్తున్నారన్నారు. క్వాడ్ నిరంతరం అభివృద్ధి చెందుతోందని.. అక్టోబర్ 29–30 తేదీల్లో ముంబయిలో జరిగిన క్వాడ్ పోర్ట్స్ ఆఫ్ ది ఫ్యూచర్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. ఇండియా మారిటైమ్ వీక్ ఒక ముఖ్యమైన కార్యక్రమన్నారు. ఈ సందర్భంగా ఆఫ్ఘనిస్తాన్‌కు సంబంధించిన సమస్యలపై స్పందించారు. రెండు దేశాల మధ్య అభివృద్ధి, సహకారం చర్చించామన్నారు. విదేశాంగ మంత్రి డాక్టర్ జైశంకర్, ఆఫ్ఘన్ కౌంటర్‌లో ఫోన్‌లో మాట్లాడారన్నారు. రాయబార కార్యాలయం, కార్యకలాపాలు, కాబూల్‌లోని మా సాంకేతిక మిషన్‌ను రాయబార కార్యాలయానికి అప్‌గ్రేడ్ చేయడం విషయానికొస్తే, పరిస్థితిని వివరంగా చర్చించాలన్నారు.

# గాలిలో విజయ్ మేడలు: వైగో



చెన్నై: సినీ నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్ గాలిలో మేడలు కడుతున్నారని, ఇప్పటికే ముఖ్యమంత్రి అయినట్లుగా మాట్లాడుతున్నారని ఎండీఎంకే అధినేత వైగో విమర్శలు గుప్పించారు. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, టీవీకే మధ్యే పోటీ ఉంటుందని విజయ్ చేసిన వ్యాఖ్యలపై వైగో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయ్ పేరును ప్రస్తావించకుండా ఆయన పరోక్షంగా విమర్శలు చేశారు. "ఆయన అప్పుడే ముఖ్యమంత్రి అయినట్లు మాట్లాడుతున్నారు. రాజకీయాలలో ఓనమాలు కూడా తెలుసుకోకుండా కాగితపు పడవపై సముద్రాన్ని దాటే ప్రయత్నం చేస్తున్నారు. గాలిలో మేడలు కట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన కలలన్నీ ఎండమావిలా మారుతాయని ఇదివరకే చెప్పా" అని వైగో అన్నారు. కరూర్ తొక్కిసలాట ఘటనలో బాధితులను విజయ్ మహాబలిపురంలోని ఒక రిసార్టుకు ఆహ్వానించడంపై వైగో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను వారి నివాసాలలోనే పరామర్శించకుండా రిసార్టుకు పిలిపించడం సిగ్గుచేటని ఆయన అన్నారు. తమిళనాడు చరిత్రలో ఇటువంటి పరిణామం ఎప్పుడూ చూడలేదని, ఇదో కుట్ర అని వైగో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పాక్ అణు కేంద్రాన్ని పేల్చివేయాలని ఇజ్రాయెల్-భారత్ ప్లాన్

### కానీ, ఇందిరాగాంధీ అంగీకరించలేదు: సీఐఏ మాజీ అధికారి

న్యూయార్క్: పాకిస్థాన్ అణు కార్యక్రమాన్ని మొగ్గలోనే తుంచేందుకు 1980వ దశకంలో భారత్, ఇజ్రాయెల్ కలిసి దాడికి ప్రణాళిక రచించాయన్న వార్తలపై అమెరికా మాజీ నిఘా అధికారి ఒకరు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ దాడికి నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ అంగీకరించి ఉంటే ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యేవని, కానీ ఆమె అలా చేయకపోవడం సిగ్గుచేటు అని ఆయన అభిప్రాయపడ్డారు. 1980లలో పాకిస్థాన్ రహస్యంగా అణ్వస్త్రాలను అభివృద్ధి చేస్తున్న సమయంలో సీఐఏలో కౌంటర్–ప్రొలిఫరేషన్ అధికారిగా పనిచేసిన రిచర్డ్ బార్లో, ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్‌లోని కహూటా అణుకేంద్రంపై భారత్–ఇజ్రాయెల్ ఉమ్మడి దాడికి పథకం రచించారన్న విషయం తనకు తెలుసని ఆయన ధృవీకరించారు. అయితే, ఆ సమయంలో తాను ప్రభుత్వ సర్వీసులో లేనందున తనకు ప్రత్యక్ష ప్రమేయం లేదని స్పష్టం చేశారు. "ఆ దాడి జరిగి ఉంటే బాగుండేది. ఇందిర దానికి అంగీకరించకపోవడం సిగ్గుచేటు. అది జరిగి ఉంటే చాలా సమస్యలు పరిష్కారమయ్యేవి" అని బార్లో అన్నారు. పాకిస్థాన్ అణ్వస్త్రాలను అభివృద్ధి చేయకుండా, ముఖ్యంగా ఇజ్రాయెల్ శత్రువుగా భావించే ఇరాన్‌కు వాటిని బదిలీ చేయకుండా నిరోధించేందుకే కహూటా ప్లాంట్‌పై ఈ దాడికి పథకం రచించినట్లు గతంలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ఇలాంటి దాడిని నాటి అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించి ఉండేదని బార్లో అభిప్రాయపడ్డారు. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా సాగిస్తున్న రహస్య యుద్ధానికి పాక్ సహకారం కీలకం కావడమే దీనికి కారణమని వివరించారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని ముజాహిదీన్లకు అందుతున్న అమెరికా సహాయాన్ని పాకిస్థాన్ ఒక బ్లాక్‌మెయిల్ సాధనంగా వాడుకుందని బార్లో ఆరోపించారు. పాక్ అణు ఇంధన కమిషన్ మాజీ అధిపతి మునీర్ అహ్మద్ ఖాన్ వంటి వారు ఇదే విషయాన్ని అమెరికా చట్టసభ సభ్యులకు చెప్పారని గుర్తుచేశారు. "మీరు మాకు సహాయం ఆపితే, మేం ముజాహిదీన్లకు మద్దతు ఇవ్వం అని వారు చెప్పకనే చెప్పారు" అని బార్లో వివరించారు. ఏక్యూ ఖాన్ నేతృత్వంలో ఏర్పాటైన ఈ కహూటా కేంద్రం వల్లే పాకిస్థాన్ చివరికి 1998లో అణుపరీక్షలు నిర్వహించి అణ్వస్త్ర దేశంగా అవతరించిందని ఆయన పేర్కొన్నారు.

# 50 విమానాలను మోసుకెళ్లే యుద్ధ నౌక

బీజింగ్: చైనా అత్యంత శక్తిమంతమైన 'ఫుజియాన్' (టైప్–003) యుద్ధ నౌకను ప్రారంభించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ విమాన వాహక నౌకను ఆ దేశ అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ప్రారంభించారు. హైనాన్ ద్వీపంలోని సైనిక నౌకాశ్రయంలో దీనికి సంబంధించిన వేడుకలు జరిగినట్లు స్థానిక అధికారక మీడియా వెల్లడించింది. జిన్‌పింగ్ యుద్ధ నౌకను పరిశీలించారని పేర్కొంది. 316 మీటర్ల పొడవు, 80 వేల టన్నుల బరువు కలిగిన ఫుజియాన్ విమాన వాహక నౌక దాదాపు 50 విమానాలను మోసుకెళ్లగలదు. ఇది చైనాకు చెందిన మూడవ అత్యంత ఆధునిక యుద్ధ నౌక. విద్యుదయస్కాంత ఆధారిత వ్యవస్థ అయిన ఈఎంఏఎల్ఎస్‌ను ఇందులో వినియోగించారు. ఈ తరహా సాంకేతికతను అమెరికాకు చెందిన గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ శ్రేణి విమాన వాహక నౌక మాత్రమే ఇప్పటివరకు వినియోగిస్తోంది. ఈ నౌక బీజింగ్‌కు వ్యూహాత్మక సాధనంగా ఉపయోగపడుతుందని, దేశ గౌరవాన్ని పెంచుతుందని చైనా ఇటీవల పేర్కొంది. ఫుజియాన్ తర్వాత టైప్–004 విమాన వాహక నౌకను నిర్మించేందుకు కూడా చైనా సన్నాహాలు ప్రారంభించింది. దీనిని ఈఎంఏఎల్ఎస్‌తో పాటు అణు సామర్థ్యంతో నిర్మించాలని చైనా ప్రణాళికలు రచిస్తోంది. అమెరికాతో పోటీపడుతూ చైనా తన ఆయుధ సంపత్తిని విస్తరిస్తోంది.



# శబరిమలకు 60 ప్రత్యేక రైళ్లు

### దక్షిణ మధ్య రైల్వే ప్రకటన

సికింద్రాబాద్, నవంబర్ 7 (ఈవార్తలు): శబరిమల వెళ్లే ఉభయ తెలుగు రాష్ట్రాల అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త తెలిపింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలుగు రాష్ట్రాలలోని పలు ప్రాంతాల మీదుగా శబరిమలకు 60 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. ఈ రైళ్లు నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో వివిధ తేదీలలో అందుబాటులో ఉంటాయి. నవంబరు 17, 24 తేదీల్లో, డిసెంబరు 1, 8, 15, 22, 29 తేదీల్లో, జనవరి 5, 12, 19 తేదీల్లో చర్లపల్లి నుంచి కొల్లాంకు రైళ్లు నడుస్తాయి. నవంబరు 19, 26 తేదీల్లో, డిసెంబరు 3, 10, 17, 24, 31 తేదీల్లో, జనవరి 7, 14, 21 తేదీల్లో కొల్లాం నుంచి చర్లపల్లికి రైళ్లు నడుస్తాయి. ఈ రైళ్లు పగిడిపల్లి, గుంటూరు, గూడురు, రేణిగుంట మీదుగా నడుస్తాయి. నవంబరు 16, 23, 30 తేదీల్లో, డిసెంబరు 7, 14, 21, 28 తేదీల్లో, జనవరి 4, 11, 18 తేదీల్లో నర్సాపూర్ నుంచి కొల్లాంకు రైళ్లు నడుస్తాయి. నవంబరు 18, 25,



30 తేదీల్లో, డిసెంబరు 9, 16, 23, 30 తేదీల్లో, జనవరి 6, 13, 20 తేదీల్లో కొల్లాం నుంచి నర్సాపూర్‌కు రైళ్లు నడుస్తాయి. ఈ రైళ్లు విజయవాడ, గూడూరు, రేణిగుంట మీదుగా వెళతాయి. నవంబరు 14, 21, 28 తేదీల్లో, డిసెంబరు 26, జనవరి 02 తేదీల్లో మచిలీపట్నం నుంచి కొల్లాంకు రైళ్లు నడుస్తాయి. నవంబరు 16, 23, 30 తేదీల్లో, డిసెంబరు 28, జనవరి 04 తేదీల్లో కొల్లాం నుంచి మచిలీపట్నంకు రైళ్లు నడుస్తాయి. ఈ రైళ్లు గూడూరు, రేణిగుంట మీదుగా ప్రయాణిస్తాయి. డిసెంబరు 05, 12, 19 తేదీల్లో, జనవరి 09, 16 తేదీల్లో మచిలీపట్నం నుంచి కొల్లాంకు, డిసెంబరు 7, 14, 21 తేదీల్లో, జనవరి 11, 18 తేదీల్లో కొల్లాం నుంచి మచిలీపట్నంకు రైళ్లు నడుస్తాయి. ఈ రైళ్లు గుంటూరు, నంద్యాల, కడప, రేణిగుంట మీదుగా వెళతాయి.

వయ్యారి చిత్రం



అనుపమ పరమేశ్వరన్



## కత్రినాకు కొడుకు పుట్టాడు!

బాలీవుడ్ సెలబ్రిటీ విక్కీ కౌశల్, కత్రినా కైఫ్ మగబిడ్డకు జన్మనిచ్చారు. సోషల్ మీడియాలో ఈ వార్తను అధికారికంగా ప్రకటించారు. బాబు పుట్టిన విషయాన్ని వెల్లడిస్తూ, తమ జీవితాల్లోకి కొత్త వెలుగు వచ్చిందని, మా జీవితాల్లోకి వచ్చిన ఈ చిన్న మిరాకల్ కు మీ ఆశీస్సులు కావాలని పోస్ట్ చేస్తూ తమ సంతోషాన్ని వెల్లడించారు. ఈ వార్త తెలుసుకున్న అభిమానులు, సెలబ్రిటీలు విక్కీ, కత్రినాకు విషెస్ విషెస్ చెప్తూ పోస్టులు చేస్తుండగా, ఈ ఇయర్ సెప్టెంబర్ లో కత్రినా, విక్కీ తమ మొదటిబిడ్డను ఆశిస్తున్నట్టు ప్రకటించారు. కత్రినా ప్రెగ్నెంట్ అనే వార్త ఎంతోమంది అభిమానులకు సంతోషాన్నివ్వగా, కత్రినా బేబీ బంప్ ఫోటోలను కూడా పోస్ట్ చేసి తన సంతోషాన్ని పంచుకున్నారు.

## నటి సులక్షణ పండిట్ కన్నుమూత

చిత్ర సీమలో మరో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నటిగా , గాయనిగా తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సినీ పరిశ్రమలో ఏర్పాటు చేసుకున్న సులక్షణ పండిట్ గురువారం రోజు తుది శ్వాస విడిచారు. ఛాతీలో నొప్పి రావడంతో దగ్గర్లోని నానావతి హాస్పిటల్‌కి తరలిస్తూ ఉండగా.. మార్గం మధ్యలోనే ఆమె తుది శ్వాస విడిచినట్లు ఆమె సోదరుడు లలిత్ పండిట్ స్పష్టం చేశారు. ప్రస్తుతం సులక్షణ పండిట్ వయసు 71 సంవత్సరాలు. గుండెపోటుతో ఆమె మరణించడాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. పలువురు సినీ సెలబ్రిటీలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



## క్రూరమైన విరోధి.. కుంభ

మహేష్ బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కస్తున్న సినిమా ఎస్ఎస్ఎంబీ 29 నుంచి ఫస్ట్ అప్డేట్ వచ్చేసింది. ఫస్ట్ అప్‌డేట్‌గా పృథ్వీరాజ్ సుకుమారన్ లుక్‌ను రాజమౌళి విడుదల చేశారు. ఫస్ట్ అప్డేట్



విడుదల సందర్భంగా రాజమౌళి స్పందిస్తూ.. పృథ్వీతో మొదటి షాట్ చిత్రీకరించిన తర్వాత, నేను అతని దగ్గరకు వెళ్లి.. మీరు నాకు తెలిసిన అత్యుత్తమ నటులలో ఒకరు అని చెప్పాను అని వెల్లడించారు. ఈ దుష్ట, క్రూరమైన, శక్తివంతమైన విరోధి.. కుంభ పాత్రకు ప్రాణం పోయడం సృజనాత్మకంగా, సంతృప్తికరంగా ఉందన్నారు. తన కుర్చీ(పాత్ర)లో ఒదిగిపోయినందుకు పృథ్వీకి ధన్యవాదాలు అని రాజమౌళి పేర్కొన్నారు. ఈ మూవీ నుంచి నవంబర్ 15న ఒక ప్రత్యేక "గ్లోబల్ ట్రోటర్" ఈవెంట్ జరగనున్న సంగతి తెలిసిందే. రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహించనున్న ఈ వేడుకలో సినిమాలో మహేశ్ బాబుకు సంబంధించిన అప్డేట్‌ను రాజమౌళి విడుదల చేయబోతున్నారు. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో అడ్వెంచర్, యాక్షన్ మూవీగా పాన్ వరల్డ్ స్థాయిలో ఈ సినిమా రాబోతోంది. దీనిపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## శివ కార్తికేయన్ 'పరాశక్తి' ఫస్ట్ సింగిల్!

ఈ మధ్యనే మదరాసి సినిమాతో అభిమానులను పలకరించిన శివ కార్తికేయన్.. త్వరలోనే పరాశక్తి అనే మరో మూవీతో రాబోతున్నారు. సుధా కొంగర డైరెక్షన్లో వస్తున్న పరాశక్తి సినిమా నుండి తాజాగా మూవీ మేకర్స్ మొదటి పాటను విడుదల చేశారు. ప్రస్తుతం పరాశక్తి మూవీ నుండి వచ్చిన ఫస్ట్ సింగిల్ అభిమానులను ఉత్సాహపరుస్తోంది. తాజాగా పరాశక్తి మూవీ మేకర్స్ "సింగారాల సీతాకోకవే" అనే పాట ప్రేక్షకుల నుంచీ పాజిటివ్ టాక్ అందుకుంటుంది... శివ కార్తికేయన్ హీరోగా.. శ్రీలీల హీరోయిన్ గా నటించిన ఈ మూవీ వచ్చే ఏడాది జనవరి 14న అంటే సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి విడుదల కాబోతోంది.



## అను ఇమ్మాన్యుయేల్.. అన్ లక్కీ గర్ల్!

ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే అందం, అభినయం మాత్రమే సరిపోవు, కొంచెం అదృష్టం కూడా కావాలి. ఈ మాట బహుశా నటి అను ఇమ్మాన్యుయేల్‌కు సరిగ్గా సరిపోతుందేమో. చూడగానే ఆకట్టుకునే రూపం, నటనకు అవకాశం ఉన్న పాత్రలు దొరికినా.. ఆమె కెరీర్ ఎందుకో గాడిలో పడలేకపోతోంది. 2016 లో న్యాచురల్ స్టార్ నాని సరసన 'మజ్ను' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది ఈ మలయాళీ బ్యూటీ. ఆ సినిమాలో కిరణ్మయి పాత్రలో చక్కగా నటించి, మొదటి సినిమాతోనే మంచి మార్కులు కొట్టేసింది. ఈమెకు ఇండస్ట్రీలో మంచి భవిష్యత్తు ఉంటుందని అందరూ అనుకున్నారు. కానీ, 'మజ్ను' తర్వాత ఆమె వేసిన అడుగులు సరైన ఫలితాన్ని ఇవ్వలేదు. 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త', 'ఆక్సిజన్' వంటి సినిమాలు నిరాశపరిచాయి. ఆ తర్వాత ఏకంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తో 'అజ్ఞాతవాసి', స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్‌తో 'నా పేరు సూర్య' లాంటి భారీ అవకాశాలు వచ్చాయి. దురదృష్టవశాత్తూ, ఆ రెండు భారీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద దారుణంగా ఫ్లాప్ అయ్యాయి. ఆ దెబ్బకు ఆమె కెరీర్ ఒక్కసారిగా వెనకపడింది. ఆ తర్వాత 'శైలజారెడ్డి అల్లుడు' ఫరవాలేదనిపించినా, 'మహా సముద్రం', 'రావణాసుర' వంటి సినిమాలు కూడా ఆమెకు ఏమాత్రం కలిసిరాలేదు. దీంతో ఆమెకు మెయిన్ హీరోయిన్‌గా అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో, ఆమె ఇప్పుడు 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా కూడా అను ఇమ్మాన్యుయేల్‌కు అంతగా కలిసిరాలేదనే చెప్పాలి.




## పెళ్లి వేదిక కోసం ఉదయ్‌పూర్‌కు రష్మిక!

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా ఎంగేజ్‌మెంట్ ఈ మధ్యే జరిగిన విషయం తెలిసిందే. పెళ్లి పనులు కూడా మొదలయ్యాయని తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం పెళ్లి వేదికల అన్వేషణలో భాగంగా రష్మిక ఇటీవల ఉదయ్‌పూర్‌కు ఒక చిన్న ట్రిప్ వేసింది. తన జీవితంలో అతిపెద్ద ఈవెంట్‌కు అన్ని ఏర్పాట్లు కచ్చితంగా ఉండేలా చూసుకోవడానికి ఈ నటి స్వయంగా పెళ్లి వేదిక కోసం వెతుకుతోంది. 'రష్మిక ఉదయ్‌పూర్‌లో అనువైన వేదికల కోసం వెతకడానికి వెళ్లడం నిజం. ఆమె మూడు రోజులు అక్కడే ఉండి, ఆ నగరంలో ఉన్న లొకేషన్లు, రాజభవనం లాంటి రిసార్ట్‌లను పూర్తిగా చూశారు. ఉదయ్‌పూర్ దాని ప్యాలెస్ రిసార్ట్‌లు, సరస్సులకు చాలా ప్రసిద్ధి చెందింది. విజయ్‌తో తన శాశ్వత బంధాన్ని అక్కడ పదిలం చేసుకోవడానికి ఈ నగరం సరైనదని రష్మిక భావిస్తోంది' అని సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి.

## బాలయ్య రౌద్రం షురూ

అఖండ2.. డిసెంబర్ 5, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ సినిమా కోసం అభిమానుల ఎదురుచూపులు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలోనే, చిత్ర బృందం శుక్రవారం 'ది తాండవం ప్రోమో'ను విడుదల చేసి అంచనాలను మరింత పెంచింది. తమన్ తన బీజీఎంతో ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు మరోసారి ప్రాణం పోస్తున్నట్టు ఈ ప్రోమో స్పష్టం చేసింది. ఇప్పటికే విడుదలైన టీజర్లలో, బాలకృష్ణ మంచు కొండల్లో నాగసాధువు గెటప్‌లో త్రిశూలం పట్టుకుని కనిపించిన విజువల్స్.. 'అఖండ' క్యారెక్టర్‌ను మరో స్థాయిలో నిలబెట్టాయి. అధర్మంపై ధర్మాన్ని నిలబెట్టే బాలయ్య పోరాటం, పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానున్నాయి. డిసెంబర్ 5న బాలయ్య అభిమానులకు పండగ వాతావరణం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.





# శ్రీచరణికి 2.5 కోట్లు

భారత మహిళా క్రికెటర్, తెలుగు తేజం నల్లపురెడ్డి శ్రీ చరణికి ఏపీ సర్కార్ ఘన స్వాగతం పలికింది. మహిళల వన్డే ప్రపంచకప్ 2025 విజయానంతరం స్వరాష్టానికి చేరుకున్న శ్రీ చరణికి శుక్రవారం గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులు అనిత, సంధ్యారాణి, సవితతో పాటు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఏసీఏ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి టీమిండియా మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌తో కలిసి శ్రీచరణి నేరుగా సీఎం క్యాంప్ కార్యాలయానికి రాగా.. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. ఆ తర్వాత సీఎం చంద్రబాబు నాయుడిని శ్రీచరణి, మిథాలీ రాజ్ కలిసారు. ఈ సందర్భంగా శ్రీచరణిని చంద్రబాబు అభినందించారు. ఆమె ప్రదర్శనను ప్రత్యేకంగా కొనియాడిన చంద్రబాబు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వన్డే ప్రపంచకప్ విజయంతో భారత మహిళా క్రికెటర్లు దేశంలోని మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని చంద్రబాబు కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీచరణికి ఏపీ సర్కార్ రూ. 2.5 కోట్ల నగదును, గ్రూప్ వన్ ఉద్యోగం, కడపలో భూమి ఇస్తామని ప్రకటించింది.

# శ్రీచరణికి జాక్‌పాట్..!



వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)2026 సీజన్ మెగా వేలానికి రంగం సిద్ధమైంది. ఈ మెగా వేలం నవంబర్ 27న జరగనుంది. ఈ వేలంలో తెలుగు తేజం, ప్రపంచకప్ విన్నర్ శ్రీచరణి పంట పండనుంది. గత సీజన్‌లో ఢిల్లీకి ప్రాతినిథ్యం వహించిన శ్రీచరణిని ఢిల్లీ క్యాపిటల్స్ ఈ సారి రిటైన్ చేసుకోలేదు. ముగ్గురు భారత ఆటగాళ్లకు మాత్రమే అవకాశం ఉండటంతో జెమీమా రోడ్రిగ్స్(రూ.2.2 కోట్లు), షెఫాలీ వర్మ(రూ. 2.2 కోట్లు), నికీ ప్రసాద్(రూ.50 లక్షలు)లను మాత్రమే అంటిపెట్టుకుంది. ఈ ముగ్గురితో పాటు మారిజానే కాప్(రూ.2.2 కోట్లు), అన్నబెల్ సదర్లాండ్(రూ.2.2 కోట్లు)లను తీసుకుంది. దాంతో ఆర్‌టీమ్ అవకాశం కూడా ఢిల్లీకి లేకుండా పోయింది. గత సీజన్‌లో రూ. 50 లక్షలకు శ్రీచరణిని ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేయగా..రెండు మ్యాచ్‌ల్లోనే ఆమెకు అవకాశం దక్కింది. ఈ రెండు మ్యాచ్‌ల్లో శ్రీ చరణి 4 వికెట్లు తీసింది. ఈ ప్రదర్శనతోనే టీమిండియాకు ఆడే అవకాశం అందుకున్న శ్రీచరణి ఏకంగా.. మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీకి ఎంపికైంది. ఈ టోర్నీలో 21 ఏళ్ల శ్రీ చరణి అదరగొట్టింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ అయిన ఈ ఆంధ్రా అమ్మాయి 9 మ్యాచ్‌ల్లో 4.96 ఎకానమీతో 14 వికెట్లు పడగొట్టింది. ఈ 9 మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచ్ మినహా.. ప్రతీ మ్యాచ్‌లో వికెట్ తీసింది. ముఖ్యంగా సెమీస్, ఫైనల్లో ఆమె కట్టుదిట్టమైన బౌలింగ్ టీమిండియా విజయానికి బాటలు వేసింది. ఈ టోర్నీలో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచింది. ఈ ప్రదర్శన నేపథ్యంలో డబ్ల్యూపీఎల్ 2026 మెగా వేలంలో శ్రీచరణి భారీ ధర పలికే ఛాన్స్ ఉంది. రూ. కోటి నుంచి రూ. 2 కోట్ల ధర ఈజీగా పలుకుతుందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# భరణంగా నాలుగు లక్షలా?

## షమీ మాజీ భార్యకు సుప్రీం సూటి ప్రశ్న

టీమ్ ఇండియా క్రికెటర్ మొహమ్మద్ షమీ నుంచి తనకు భరణం పెంచాలంటూ ఆయన మాజీ భార్య హసిన్ జహాన్ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు షమీ, బెంగాల్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా 'నెలకు రూ.4లక్షలు అంటే పెద్ద అమౌంట్ కాదా..?' అంటూ సూటిగా ప్రశ్నించింది. ఈ మేరకు హసిన్ అభ్యర్థనపై స్పందన తెలియజేయాలని షమీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా స్పందన తెలియజేయాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణ డిసెంబర్‌కు వాయిదా వేసింది. షమీపై గృహహింస కేసు నమోదు చేసినప్పుడు.. తనకు భరణం కింద నెలకు రూ.10 లక్షలు ఇవ్వాలని ఆమె కోర్టులో కేసు వేసింది. అందులో రూ.7 లక్షలు తన ఖర్చుల నిమిత్తం కాగా, మరో రూ.3 లక్షలు కుమార్తె కోసమని పేర్కొంది. దీనిపై ఈ ఏడాది జనవరిలో విచారణ జరిపిన కోల్‌కతా హైకోర్టు.. హసీన్‌కు భరణం కింద ప్రతి నెలా రూ.1.30లక్షలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో రూ.50వేలు హసీన్‌కు కాగా, మరో రూ.80వేలు కుమార్తె బాగోగుల కోసం చెల్లించాల్సిందిగా ఉత్తర్వుల్లో ఆదేశించింది. ఆ తర్వాత నెలకు రూ.4లక్షలు ఇవ్వాల్సిందిగా షమీని హైకోర్టు ఆదేశించింది. దీనిపై హసిన్ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.



# గిల్‌పై వేటు!

**నేడే ఆఖరి టీ20.. సిరీస్ గెలవాలని సూర్య సేన.. సమం చేయాలని ఆసీస్ ఆశలు**



ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలో నిలిచిన భారత జట్టు ఆఖరి పోరుకు సిద్ధమైంది. శనివారం బ్రిస్బేన్ వేదికగా జరిగే మ్యాచ్‌లో ఆతిథ్య ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. నాలుగో టీ20లో అద్భుత విజయాన్ని అందుకున్న టీమిండియా ఆఖరి మ్యాచ్‌లోనూ అదే జోరు కొనసాగించి సిరీస్ కైవసం చేసుకోవాలనుకుంటుంది. మరోవైపు యాషెస్ సిరీస్ నేపథ్యంలో సీనియర్లు దూరమైన వేళ యువ ప్లేయర్లతో ఆడుతున్న ఆసీస్.. సిరీస్ సమం చేయడంపై కన్నేసింది. టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహకంలో భాగంగా ఆఖరి మ్యాచ్‌లోనూ మార్పులు చేసే అవకాశం ఉంది. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డితో పాటు సంజూ శాంసన్‌ను తుది జట్టులోకి తీసుకునే ఛాన్స్ ఉంది. ఈ ఇద్దరి కోసం వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు శివమ్ దూబేకు విశ్రాంతి ఇవ్వవచ్చు. టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహాల్లో భాగంగా ఈ సిరీస్‌ను టీమిండియా ప్రయోగాలకు ఉపయోగించుకుంది. హర్షిత్ రాణా, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌లను తొలి రెండు టీ20ల్లో ఆడించగా.. జట్టు అంచనాలను అందుకోలేకపోయారు. దాంతో మూడో టీ20లో ఈ ముగ్గురిపై వేటు వేసిన గంభీర్.. జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్‌లకు అవకాశాలు కల్పించింది. ఈ ముగ్గురు అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు. నాలుగో టీ20లో జితేశ్, సుందర్ విఫలమైనా.. ఆఖరి మ్యాచ్‌లో కొనసాగించనున్నారు. రెండు మినహా తుది జట్టులో భారీగా మార్పులు జరిగే అవకాశం లేదు. బ్యాటింగ్‌లో సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ సత్తా చాటాల్సి ఉంది. ముఖ్యంగా సూర్య వైఫల్యం విమర్శలకు దారి తీస్తోంది. బౌలింగ్ బాధ్యతలను జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లతో పాటు స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి,వాషింగ్టన్ సుందర్‌లు పంచుకోనున్నారు. నితీష్ కుమార్ రెడ్డి కూడా అండగా నిలవనున్నాడు.

# కోహ్లీనే అత్యుత్తమ వన్డే ప్లేయర్

'వన్డేల్లో అత్యుత్తమ ఆటగాడు ఎవరు?' అనే చర్చ ఎప్పటినుంచో నడుస్తోంది. సచిన్ టెండూల్కర్, రికీ పాంటింగ్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ.. 'ఈ నలుగురిలో గ్రేటెస్ట్ ఎవరు?' అని తేల్చడం చాలా కష్టమని, ఎవరికివారే గొప్పని కొందరు వాదించారు. అయితే.. ఆస్ట్రేలియా దిగ్గజం స్టీవ్ వా మాత్రం తన ఓటు కోహ్లీకే అంటున్నాడు. వన్డే క్రికెట్‌లో ఆల్ టైమ్ గ్రేట్ ఆటగాడు విరాటేనని కుండబద్దలు కొట్టేశాడీ ఆసీస్ మాజీ సారథి. అలాఅనీ అతడు రికార్డులు చూసి ఈ మాట చెప్పడం లేదు. కోహ్లీ ఆటను, ప్రతిభను, స్ఫూర్తినిచ్చే వ్యక్తిత్వాన్ని కలగలిపి ఈ ప్రకటన చేశాడు. ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతున్న విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియా పర్యటనను ఘనంగా ముగించాడు. వచ్చే వన్డే వరల్డ్ కప్‌తో కెరీర్ ముగించాలనుకుంటున్న విరాట్‌పై స్టీవ్ వా ప్రశంసలు కురిపించాడు. గురువారం యాషెస్ ట్రోఫీ ఆవిష్కరణ సమయంలో మీడియాతో మాట్లాడిన ఆసీస్ మాజీ కెప్టెన్ తనకు కోహ్లీ ఆట అంటే ఎంతో ఇష్టమని చెప్పాడు. 'నిలకడగా రాణించడం, పరుగులు సాధించాలనే ఆకలితో ఉండడం వంటి లక్షణాల ద్వారా కోహ్లీ ప్రపంచ క్రికెట్‌లో కొత్త ప్రమాణాలు నెలకొల్పాడు. ఒకతరంలో మాత్రమే కనిపించే క్రికెటర్లలో విరాట్ ఒకడు. అతడు అసాధారణ ప్రతిభావంతుడు. అందుకే అవకాశం దొరికితే కచ్చితంగా కోహ్లీ ఆట చూడండి' అని అభిమానులను కోరాడు స్టీవ్ వా.



# మిస్టర్ కూల్ వచ్చేస్తున్నాడు!

ఐపీఎల్ అభిమానులకు గుడ్‌న్యూస్. వచ్చే సీజన్‌లో మహేంద్ర సింగ్ ధోనీ ఆడుతాడా? లేదా? అనే వార్తలకు ఎండ్‌కార్డ్ పడింది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో రారాజుగా వెలుగొందుతున్న మహీ భాయ్ మరో సీజన్‌కు సన్నద్ధమవుతున్నాడు. శరీరం సహకరిస్తే మరో సీజన్ ఆడుతానని ఇదివరకే ప్రకటించిన ధోనీ.. మరోమారు పసుపు జెర్సీతో స్టేడియాలను దద్దరిల్లేలా చేయనున్నాడు. అవును.. ధోనీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయాన్ని క్రిక్‌బజ్‌తో చెన్నై సూపర్ కింగ్స్ సీఈఓ కాశీ విశ్వనాథన్ పంచుకున్నాడు. మీరు విన్నది నిజమే. ఐపీఎల్ 19వ సీజన్‌లో ధోనీ ఆడుతున్నాడు అని ఆయన తెలిపాడు. శుక్రవారం 'క్రిక్‌బజ్'తో మాట్లాడిన సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్.. 'వచ్చే సీజన్‌లో ఆడేందుకు నేను సిద్ధంగా ఉన్నాను అని ధోనీ మాతో చెప్పాడు. అతడి నిర్ణయం పట్ల చాలా సంతోషంగా ఉన్నాం. అనుభవజ్ఞుడైన ధోనీ యువతరానికి మార్గనిర్దేశనం చేయడంలో కీలకం కానున్నాడు' అని విశ్వనాథన్ పేర్కొన్నాడు. ఈ సందర్భంగా సంజూ శాంసన్‌ను రాజస్థాన్ రాయల్స్ నుంచి కొనడంపై గురించి చర్చలు జరుగుతున్నాయని విశ్వనాథన్ తెలిపాడు. నవంబర్ 10, 11వ తేదీల్లో సీఎస్కే యాజమాన్యం, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో ధోనీ సమావేశం అవుతాడని సమాచారం. సీఎస్కే భవిష్యత్ గురించి.. వేలంలో కొనాల్సిన ఆటగాళ్ల గురించి చర్చించే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శనివారం 8-11-2025 | www.evarthalu.com



నోట్ల రద్దు.. భారతదేశ చరిత్రలో అత్యంత సంచలన ఆర్థిక నిర్ణయాలలో ఒకటైనది 2016లో జరిగిన నోట్ల రద్దు (డీమోనిటైజేషన్). 2016 నవంబరు 8న, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతికి ఉద్దేశించిన ప్రసంగంలో, రూ.500, రూ.1,000 రూపాయి నోట్లను చెల్లనివిగా ప్రకటించారు. ఈ నోట్లు ఆ సమయంలో మొత్తం డబ్బు ప్రసరణలో 86% ఉన్నాయి, అంటే జీడీపీ సుమారు 11% విలువ. ఈ నిర్ణయం రాత్రికి రాత్రి తీసుకున్నప్పటికీ, దీని ప్రభావాలు దేశ ఆర్థిక వ్యవస్థ, సమాజం , రాజకీయాలపై లోతుగా పడిపోయాయి.

# నోట్ల రద్దుకు 9 ఏళ్లు

ఈ వ్యాసంలో, దీని నేపథ్యం, కారణాలు, ప్రభావాలు, విమర్శలు , దీర్ఘకాలిక పరిణామాలను పరిశీలిస్తాం. భారతదేశంలో డెమోనిటైజేషన్ కొత్త కాదు. 1946 , 1978లో కూడా ఇలాంటి చర్యలు తీసుకున్నారు, అయితే అవి చిన్న స్థాయిలో ఉన్నాయి. 2016 చర్య ప్రధానంగా నల్లధనం (బ్లాక్ మనీ), అవినీతి, నకిలీ డబ్బు , ఉగ్రవాద ఫైనాన్సింగ్‌ను అరికట్టడానికి ఉద్దేశించబడింది. ప్రభుత్వం ప్రకారం, ఈ నోట్లు నల్లధన లావాదేవీలకు ప్రధాన మాధ్యమం. అలాగే, ఆర్థిక వ్యవస్థను డిజిటల్‌కు మార్చడం, పన్నుల సేకరణ పెంచడం , ఫార్మల్ ఎకానమీని బలోపేతం చేయడం ఇతర లక్ష్యాలు. ప్రభుత్వం ఈ చర్యను 6-10 నెలల ముందు రహస్యంగా ప్రణాళికాబద్ధంగా చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం, కొత్త రూ.2,000 నోట్ల డిజైన్ ఆగస్టు 2016లోనే ధృవీకరించబడింది. ప్రకటన తర్వాత, ప్రజలకు డిసెంబరు 30 వరకు పాత నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేయడానికి అవకాశం ఇచ్చారు. కొత్త రూ.500 , రూ.2,000 నోట్లు మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ చర్య దేశవ్యాప్తంగా బ్యాంకులు , ఏటీఎంలలో లైన్‌లకు, డబ్బు కొరతకు దారితీసింది.

డీమోనిటైజేషన్ ప్రకటన తర్వాత, దేశవ్యాప్తంగా భారీ గందరగోళం ఏర్పడింది. ప్రజలు బ్యాంకులు , ఏటీఎంల ముందు గంటల తరబడి నిలబడ్డారు. డబ్బు ప్రసరణ 75% తగ్గింది, దీనివల్ల అన్‌ఆర్గనైజ్డ్ సెక్టర్ (చిన్న వ్యాపారాలు, వ్యవసాయం) తీవ్రంగా ప్రభావితమైంది. 2016 చివరి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7%గా ఉండాలని అంచనా వేయబడినప్పటికీ, నిజానికి ఉద్యోగాలు , ఉత్పత్తి 2-3% తగ్గాయి. క్రెడిట్ వృద్ధి 2 పర్సెంటేజ్ పాయింట్లు తగ్గింది. వ్యవసాయం, చిన్న పరిశ్రమల్లో రూ.15.5% ఆదాయ నష్టం జరిగింది. అన్‌ఆర్గనైజ్డ్ సెక్టర్‌లో ఉద్యోగాలు కోల్పోయారు, జీతాలు తగ్గాయి. మైగ్రెంట్ వర్కర్లు, గ్రామీణ పేదలు తీవ్రంగా బాధపడ్డారు. మధ్యాహ్న భోజన పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలు డబ్బు కొరతతో ప్రభావితమయ్యాయి. సర్వేల ప్రకారం, డిసెంబర్ 2016లో ఉద్యోగాలు 3% తగ్గాయి. డబ్బు కొరత వల్ల డెబిట్ కార్డ్ లావాదేవీలు 84% పెరిగాయి. పేటీఎం వంటి మొబైల్ వాలెట్లు 435% ట్రాఫిక్ పెరిగింది. పీవోఎస్ ట్రాన్సాక్షన్లు మూడు రెట్లు పెరిగాయి. డీమోనిటైజేషన్ ప్రభావాలు తాత్కాలికమే అని చాలా అధ్యయనాలు తెలిపాయి. 2017 మొదటి త్రైమాసికం నుండి ఆర్థిక వ్యవస్థ కోలుకుంది. అయితే, 99% పాత నోట్లు బ్యాంకులకు తిరిగి వచ్చాయి, కాబట్టి నల్లధనం ఎక్కువగా బయటపడలేదు. కాకపోతే, పన్నుల సేకరణ పెరిగింది (2017లో 18% పెరుగుదల). డిజిటల్ చెల్లింపులు శాశ్వతంగా పెరిగాయి %-% ఏటీఎం విత్‌డ్రాయల్స్ 20% తగ్గాయి, మొబైల్ బ్యాంకింగ్ మూడు రెట్లు. ఫార్మల్ ఎకానమీలో మార్పు జరిగింది, బ్యాంక్ డిపాజిట్లు పెరిగాయి. రియల్ ఎస్టేట్, ఎస్ఎంఈలు దీర్ఘకాలికంగా ప్రభావితమయ్యాయి. కరోనా వల్ల జీడీపీ ప్రభావాలు మరింత గందరగోళంగా మారాయి.

**-పల్లెబోయిన రఘువీర్, బ్యాంకింగ్ నిపుణుడు**




# వైద్య రంగంలో సంచలనం.. ఎక్స్ రే

**నేడు అంతర్జాతీయ రేడియోగ్రఫీ దినోత్సవం**



ప్రపంచం అభివృద్ధి చెందడంతో పాటు వైద్య రంగం కూడా అభివృద్ధి చెందుతూ వస్తోంది. ఎన్నో రకాల ఆవిష్కరణలు మనిషి జీవితాన్ని సులువు చేస్తున్నాయి. నివారణ లేదు అనుకునే జబ్బులకు పరిష్కారాలు కనుగొనబడుతున్నాయి. వైద్య రంగంలో ఎక్స్-కిరణాలు ఉపయోగించడం ఒక అద్భుతం. ప్రజలకు వైద్యం చేయడానికి దాన్ని ఉపయోగించడం అపురూప ఘట్టం. ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ 8 న జరుపుకుంటారు, ఎందుకంటే ఇది ఎక్స్- కిరణాలు కనుగొనబడిన సందర్భాన్ని పురస్కరించుకుని వార్షికోత్సవాన్ని జరుపుకునే రోజు.

ఎక్స్-రే అనేది విద్యుదయస్కాంత తరంగాల ఒక రూపం, ఇవి మానవ శరీరం లోపలి భాగాలను చూడటానికి, పదార్థాలను పరిశీలించడానికి ఉపయోగపడతాయి. ఇవి 1895లో కనుగొనబడినప్పటి నుండి వైద్యశాస్త్రం, భౌతికశాస్త్రం, ఇంజనీరింగ్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. ప్రస్తుతం అభివృద్ధి చెందిన వైద్య రంగంలో ఈ ఎక్స్-కిరణాలు లేని ప్రపంచాన్ని ఊహించడం కష్టం. అనేక వైద్య రోగనిర్ధారణ సాధనాలకు పునాదిగానూ మరియు అనేక రకాల సమస్యలను కనుగొనడంలోనూ ఈ ఎక్స్-కిరణాలు వైద్యులకు సహాయపడతాయి. నిమిషాల వ్యవధిలో వీటిని ఉపయోగించడగలగడం, రోగులకు ఎలాంటి నొప్పి తెలియనివ్వకుండా వీటితో వైద్యం చేయగలగడం వీటికి ప్రాధాన్యత పెరగడానికి కారణం. 1895లో జర్మనీలోని వుర్జ్ బర్గ్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ విల్హెల్మ్ కాన్రాడ్ రోంట్‌జెన్ అనుకోకుండా ఎక్స్-కిరణాలను కనుగొన్నారు. రోంట్‌జెన్ తన ప్రయోగశాలలో కాథోడ్ కిరణాలతో పని చేస్తున్నప్పుడు తన ట్యూబ్ సమీపంలోని టేబుల్‌పై స్ఫటికాల ఫ్లోరోసెంట్ గ్లోను గమనించాడు, అందులో ఒక గ్లో ఉంది. ప్రతికూల మరియు సానుకూల ఎలక్ట్రోడ్లతో ఆ బల్బ్ ఉంది. ట్యూబ్‌లోని గాలిని ఖాళీ చేసి, అధిక ఓల్టేజీని ప్రయోగించినప్పుడు, ట్యూబ్ ఫ్లోరోసెంట్ గ్లోను ఉత్పత్తి చేయడం ప్రారంభించింది. ట్యూబ్‌ను నల్ల కాగితంతో కప్పి, ట్యూబ్‌కు కొన్ని అడుగుల దూరంలో ఉంచినప్పుడు పదార్థం ఆకుపచ్చ ఫ్లోరోసెంట్ లైట్‌ను ఉత్పత్తి చేస్తుందని అతను కనుగొన్నాడు. ఈ పరిశీలనలతో, ట్యూబ్ కొత్త రకం కిరణాలను విడుదల చేస్తోందని, అది పేపర్ కవర్ గుండా వెళ్లి ఫాస్ఫోరేసెంట్ పదార్థాలను ఉత్తేజపరిచే సామర్థ్యాన్ని కలిగి ఉందని అతను నిర్ధారించాడు. ఈ కొత్త కిరణం అనేక పదార్థాల గుండా వెళుతుందని, ఘన వస్తువులపై నీడలు పడుతుందని అతను కనుగొన్నాడు. కిరణం మానవ కణజాలాల గుండా కూడా వెళుతుందని నిర్ధారించాడు. ఒక రోజు సాయంత్రం, రాంట్జెన్ కాథోడ్ రే ట్యూబ్‌ను నల్ల కాగితంతో కప్పి, దాని చుట్టూ చీకటి ఏర్పరచాడు. ట్యూబ్‌ను ఆన్ చేసినప్పుడు, గది మూలలో ఉన్న ఫ్లోరసెంట్ స్క్రీన్ (బేరియం ప్లాటినోసయానైడ్ పూత పూసిన స్క్రీన్) మెరిసిపోయింది. ఇది కాథోడ్ రేలు కాదని, కొత్త రకమైన కిరణాలని గుర్తించాడు. ఈ కిరణాలు గోడలు, కాగితాలు దాటి వెళ్తున్నాయి. కానీ ఎముకలు, లోహాలు వంటి దట్టమైన పదార్థాలను ఆపుతున్నాయి. రాంట్జెన్ ఈ కిరణాలను "ఎక్స్-కిరణాలు" అని పిలిచాడు, ఎందుకంటే అవి అప్పట్లో తెలియని రకం. తన భార్య అన్నా బెర్తా హ్యాండ్‌ను ఫోటోగ్రాఫిక్ ప్లేట్ మీద ఉంచి మొదటి ఎక్స్-రే చిత్రాన్ని తీశాడు. అందులో ఆమె చేతి ఎముకలు మరియు ఉంగరం స్పష్టంగా కనిపించాయి. ఈ ఆవిష్కరణ శాస్త్రీయ పురోగతికి ఎంతగానో ఉపయోగపడింది. ఈ కిరణాలు కనుగొన్న ఒక నెల తర్వాత చాలా మంది వైద్య సిబ్బంది ఐరోపా, అమెరికాలో రేడియోగ్రాఫ్‌లను ఉపయోగించడం ప్రారంభించారు. ఆరు నెలల తర్వాత, రేడియోగ్రాఫ్‌లు గాయపడిన సైనికులకు సహాయం చేయడానికి యుద్ధభూమికి చేరుకున్నాయి. 1895 లో ఎక్స్-కిరణాలు కనుగొనబడ్డాయి అయితే ఈ కిరణాల ఆవిష్కరణ విచిత్రంగా జరిగింది. రోంట్‌జెన్ ప్రమాదవశాత్తు ఎక్స్-కిరణాలను కనుగొన్నాడు. 1896 సంవత్సరంలో మొదటి సారి శస్త్రచికిత్స లో ఉపయోగించారు. జాన్ హాల్-ఎడ్వర్డ్ అనే వైద్యుడు ఒక శస్త్ర చికిత్సలో భాగంగా ఎక్స్-కిరణాలను ఉపయోగించాడు. 1999లో ఖగోళ అనువర్తనాలు చేయబడ్డాయి. చంద్ర ఎక్స్-రే అబ్జర్వేటరీ విశ్వంలో హింసాత్మక ప్రక్రియల అన్వేషణను అనుమతించడం ప్రారంభించబడింది. 2010 సంవత్సరం నాటికి, ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఐదు బిలియన్ల వైద్య రేడియోగ్రఫీ పరీక్షలు నిర్వహించబడ్డాయి. 2022 నాటికి ఈ సంఖ్య, ఈ కిరణాల వినియోగం ప్రథమ స్థానంలో ఉంది.

**- నవ్య**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.